# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




### పబ్లిక్‌హెల్త్, కాలుష్యంపై

## కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 ప్రభాత వార్త : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారి ఆదేశాల మేరకు ఘన, ద్రవవ్యర్థాల నిర్వహణ గురించి జిల్లా కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, పబ్లిక్ హెల్త్, కాలుష్యం నియంత్రణ మండలి, స్వచ్ఛంద సంస్థ లతో చర్చించి నివేదికను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, ప్రిన్సిపల్ బెంచ్ న్యూఢిల్లీ వారికి నివేదిక తయారు చేయడంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు ఇచ్చే నివేదికను బట్టి తుది నివేదికను తయారు చేసి పంపించాలని తెలిపారు.

## సర్వ పాపహరణం లక్షకుంకుమార్చనం

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండపై గురువారం రెండవరోజున లక్షకుంకుమార్చనను 108మంది దంపతుల నడుమ జరిగింది. ప్రధాన ఆలయాల్లోని అమ్మవార్లకు నిర్వహించిన పుష్పాలంకరణ భక్తులను ముగ్ధులను చేసింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, పుష్పాలంకరణగావించారు. ఆవరణంలో ఉత్సవ విగ్రహాన్ని వుంచి ఎదురుగా దంపతుల సమక్షంలో వేదపండితులు లక్షకుంకుమార్చన చేయించారు. ఉభయదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన హోమాది కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

# చివరి మజిలికి చింతలే!

### కోట్లు వెచ్చించి శ్మశాన వాటిక: నిర్వహణలేక . . .
### రూ.40వేలు డిమాండ్ చేస్తున్న వెట్టి కార్మికులు
### ప్రభుత్వ యంత్రాంగానికి ఫిర్యాదుల వెల్లువ

**శ్రీకాళహస్తి పట్టణంలో ఉద్యమాల తరువాత రూ.కోట్లు వెచ్చించి పవిత్ర సువర్ణముఖి తీర్మాన కోట్లు వెచ్చించి హిందూ శ్మశాన వాటికను నిర్మించారు.అయితే అర కొర వసతులతో గత ప్రభుత్వం వడి వడిగా ప్రారంభోత్సవం చేసారు.ఇక్కడ నిరుపేదల,దహనం,ఖననంకు బతికున్న వారికి ముచ్చెమటలు పడుతున్నాయి.శ్మశాన వాటికను పర్యవేక్షించాల్సిన మున్సిపాలిటి పట్టించుకోవటం లేదు. దాంతో సామాన్యుడ చనిపోతే ఎత్తుబడికి కుటుంబసభ్యుల చింతలు వర్ణనాతీతంగా మారుతుంది. వెట్టి వారు ఎత్తుబడి,దహనం, ఖననానికి కనీసం రూ.40వేలు వరకు ఖర్చులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.ఈ సమస్యకు సంబంధించి గతంలో ఎంఎల్ఏ దృష్టికి కూడా తెచ్చారు.కానీ పరిస్థితి మార్పుల్లేదు.మరి ఈ చింతలు తీర్చేదిక్కేలేదా? అని పట్టణంలోని ప్రజలు వాపోతున్నారు.**





సువర్ణముఖి తీరాన వెలసిన భూకైలాస్, శ్మశాన వాటికకు సంబంధించి ఆర్‌డిఓకు ఫిర్యాదు చేస్తున్న పట్టణ ప్రజలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణ జనాబా సుమారు లక్ష.ఇందులో హిందువుల జనాభా 75శాతం ఉన్నారు. ఎవరైనా చనిపోతే సరైన శ్మశాన సదుపాయాల్లేదని ఉద్యమాలు, కోర్టుల చుట్టు ప్రదక్షిణలు చేయగా గత ప్రభుత్వ హాయంలో అప్పటి శాసనసభ్యుడు రూ.27కోట్లతో అత్యాధునిక సదుపాయాలతో 'భూకైలాస్' అంటూ ప్రకటించారు. తాను రూ.కోటి విరాళం ఇస్తున్నట్లు ప్రకటించారు.కానీ తీరా మున్సిపల్ నిధులు రూ.2.27కోట్లతో అర కొర వసతులతో నిర్మించారు.భవనాలు నిర్మించారు కానీ నిర్వహణ,కనీస సదుపాయాల్లేక వెట్టి కార్మికులకు అప్పగించారు. వీరు నిలువు దోపిడీ చేస్తున్నట్లు పలుమార్లు ప్రస్తుత శాసనసభ్యుని ఫిర్యాదులు చేయగా ఆయన తహాశీల్దార్‌కు ఎండార్స్ చేసారు. పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కులేదు. నేడు ఎవరైన పేద,మధ్యతరగతి వారు చనిపోతే 'ఎత్తుబడికి' వణికిపోతున్నారు. వెట్టి కార్మికుల నిలువుదోపిడి ఇంత అంత కాదని చెబుతున్నారు.

**భవనాల నిర్మాణంతోనే సరి . . .**

శ్రీకాళహస్తిలోని పవిత్ర జీవనది సువర్ణముఖి తీరాన చక్కటి దహన,ఖనన సంస్కారాలకు భవనాలను నిర్మించారు.కానీ అక్కడ సదుపాయాల మాట మరిచారు. దహనం చేసే యంత్రం ఎప్పుడు పనిచేస్తుందో ఎప్పుడు మూల పడుతుందోతెలియని స్థితి. మున్సిపాలిటి కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాల పర్యవేక్షణ బాధ్యతను గాలికి వదలిపెట్టింది.శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మృతిచెందిన వారి అంత్యక్రియలు,పాలు కార్యక్రమాలు,కర్మక్రియలు జరిపించు కోలేని దుస్థితి చోటు చేసుకుంది. ఇక్కడ మృతిచెందిన వ్యక్తిని దహనం చేయాలన్నా,ఖననం చేయాలన్నా వెట్టి కార్మికులు వేలకు వేలు డిమాండ్ చేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.ఈ బలవంతపూ వసూళ్ళకు సంబంధించిన వ్యతిరేకత పాలకులపై పడుతుంది.

**ఎందుకు కట్టడి చేయలేకపోతున్నారు?**

రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన శ్మశాన వాటిక పర్యవేక్షణను ఎందుకు కట్టడి చేయలేక పోతున్నారు? అనే విమర్శలు చోటు చేసుకున్నాయి. మున్సిపాలిటి ఎందుకు రేట్లు ఖరారు చేయలేక పోతున్నారని ప్రశ్నిస్తున్నారు. ఇక ఇక్కడ కర్మక్రియల మండపం లేదు.ఈ విషయంగా ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వాల తీరుతో పలువురు సుప్రీం కోర్టును ఆశ్రయించగా ఎఐఆర్ 1980 ఎస్‌సి 1622 రాట్లామ్, వర్ధిచంద్ కేసులో ప్రాథమిక పారిశుద్ధ్యం ఏర్పాటు, మానసిక హక్కులను కనీస మర్యాద,గౌరవం అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.ఇది ప్రభుత్వ బాధ్యతగా వ్యాఖ్యానించింది.అయితే వెట్టి వారు ఏమో తాము వెట్ట మాన్యం రూ.10లక్షలు చెల్లిస్తున్నామని చెబుతున్నారు.మరి వారు ఎవరికి వెట్టి మాన్యం చెల్లిస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. శ్రీకాళహస్తిలోని హిందూశ్మశాన వాటిక దుస్థితి సామాన్య,మధ్యతరగతి కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందితే శ్మశానంలో నిలువుదోపిడికి సంబంధించి శ్రీకాళహస్తి ఆర్‌డిఓకు వినతి పత్రం అందించారు.

### టిటిడిలో

# కీలక ప్రక్షాళన జరుగుతుందా!

### నేడు నూతన ఈఓ ముద్దాడ బాధ్యతలు





తిరుమల, ఫిబ్రవరి 5ప్రభాతవార్తప్రతినిధి: టిటిడిలో తాజాగా నెలకొన్న పరిస్థితులు, పరిపాలన వ్యవహారాలు చక్కబెట్టేందుకు ఈఓగా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి, సిఎం కార్యాలయం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర గురువారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. అక్కడ నుండి రవిచంద్ర దంపతులు తిరుమలకు వచ్చారు. తిరుమలలో ఆయనకు టిటిడి ఇన్‌ఛార్జి ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వీరబ్రహ్మం, సివిఎస్ఓ మురళీకృష్ణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఆయన సమర్థవంతమైన అధికారి అని అధికార వర్గాల్లో చర్చమొదలైంది. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా వ్యక్తిగత పేరు కంటే ప్రభుత్వానికి పేరురావాలని ఆయన కష్టపడిపనిచేసే తత్త్వం అలవరచు కున్నారనేది ఆయన అనుచరుల మాట. ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా 2008-09లో బాధ్యతలు నిర్వహించారు, చిత్తూరుజిల్లాతో మంచి అనుబంధం ఉంది. ఎంతో కీలకమైన, దేవుని చెంత విధులు నిర్వహించే అవకాశం,అదృష్టం రవి చంద్రకు కలిగింది. ముఖ్యకార్యదర్శి హోదాతోబాటు టిటిడి ఈఓగా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. త్వరలోనే టిటిడిలో ప్రక్షాళన దిశగా అడుగులు వేసేందుకు కసరత్తుచేయనున్నారు. రానున్న రోజుల్లో కీలక నిర్ణయాలు దిశగా అడుగులు వేసి పూర్తిస్థాయిలో వ్యవస్థలో మార్పులు తీసుకురానున్నారనేది సమాచారం. అంతకుముందు తిరుపతిలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, తిరుపతి కమిషనర్ ఎన్.మౌర్య స్వాగతం పలికారు.

## నగర ప్రజలపై భారం మోపకుండా చూడాలి

### మేయర్ డాక్టర్ శిరీష



తిరుపతి,పిబ్రవరి 5ప్రభాతవార్త: తిరుపతి నగరపాలక సంస్థ బడ్జెట్ సమావేశం ఈనెల 10వతేదీ మంగళవారం జరగనుంది. ఈ సందర్భంగా బడ్జెట్ ముసాయిదా పై నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలసి ఉన్నతాధికారులు, విభాగాల అధిపతులతో మేయర్ డాక్టర్ శిరీష సమీక్షా సమావేశం నిర్వహించారు. 2026-27 సంవత్సరానికి బడ్జెట్ రూపకల్పన చేసే సందర్భంగా కౌన్సిల్‌దే తుది నిర్ణయం అయినా అధికారులు చేసే బడ్జెట్ రూపకల్పన కౌన్సిల్ తుది నిర్ణయం తీసుకోవడానికి సులభతరం అవుతుందన్నారు. అందుకే ప్రి బడ్జట్ సమావేశానికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. గత బడ్జెట్ అంచనాలు, అమలు తీరుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, గత బడ్జెట్ అంచనాలు తగ్గట్లు ఆదాయం వచ్చిందా అనేది చూసి, అదే సమయంలో ప్రజలపై భారం లేకుండా ఆదాయం వచ్చే అంశాలలో వ్యాపార , వ్యక్తిగా ప్రకటనలు ద్వారా వస్తుందనేది చూడాలన్నారు.

నగరంలో రోజు వందల సంఖ్యలో ప్రకటన హోర్డింగులు దర్శనమిస్తున్నాయని, వాటి పన్నుల ఆదాయం మొత్తం వసులు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వివిధ రకాల పన్నులు వసూలు కాకపోతే అందుకు తగిన కారణాలపై సరైన విశ్లేషణ జరిగితే 26.. 27 బడ్జెట్ అంచనాలను కరెక్ట్ గా వేయగలమన్నారు. తిరుపతి నగర ప్రజల సౌకర్యాలకు , నగర విస్తరణ కోసం, మౌలిక వసతుల కల్పన కోసం నిధుల కేటాయింపు ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శారదా దేవి,ఉప కమిషనర్ అమరయ్య, యస్.ఈ. శ్యాంసుందర్, ఎంఈ లు తులసి కుమార్, గోమతి, ఆరోగ్యాధికారి యువ అన్వేష్, డిసిపీ ఖాన్, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, మేనేజర్ హసిమ్, ఏసీపీలు, డిఈలు అధికారులు పాల్గొన్నారు.

## భక్తి ప్రపత్తులతో "కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ"

### 8వ తేదీ నుండి 16 వరకు కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు



చంద్రగిరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: కలియుగ వైకుంఠవాసుడు శ్రీనివాసుడి పట్ల అత్యంత భక్తిప్రపత్తులతో కోయిల్ ఆళ్వార్ తిరుమం జన సేవ నిర్వహించారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఈ నెల 8 నుండి 16 వరకు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించ తలపెట్టా రు. ఈ నేపథ్యంలో సంప్రదాయానుసారం ఆలయ శుద్ధిగావించడంలో భాగంగా గురువారం ఆలయ అధికారులు, అర్చకులు, సిబ్బంది ఆలయశుద్ధి గావించారు. ఇందులో భాగంగా స్వామివారి వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. తదుపరి ఉదయం 6.30 గంటల నుండి 11 గంటల వరకు (కోయిల్ ఆళ్వార్ తిరుమంజన సేవ) ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి, తదితర వస్తువులను పరిశుద్ధ జలాలతో శుభ్రంగా చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూర ం, గంధంపొడి, కుంకుమ, కిచీలీగడ్డ వంటి వివిధ రకాల సుగంధభరిత ద్రవ్యాల పవిత్ర మిశ్రమంతో ఆలయం అంతటా ప్రోక్షణం గావించారు. ఈకార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, విజిఒ గిరిధర్, ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగకుమార్, పార్థసారధి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**పరదాలు విరాళం**

తిరుపతికి చెందిన మణి 2 పరదాలు స్వామి వారి విరాళంగా అందజేశారు. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో ఆయన పరదాలు సమర్పించడం ఆచారంగా తీసుకున్నారు. బ్రహ్మోత్సవాలలో ఈ పరదాలను వినియోగించనున్నారు.

## స్వర్ణరథంపై విహరించిన పార్వతీపుత్రుడు

కాణిపాకం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:



కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానంలో బుధవారం రాత్రి సిద్ధి బుద్ధి సమేతుడైన గణనా ధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిం చారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఉదయం 9, 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు సంకటహర చతుర్థి వ్రతంను మూడు ధఫాలుగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపే రీతిలో అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరే గించారు. ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, సూపరెం డెంట్‌లు వాసు, కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, రవి, అర్చకులు,వేదపండితులు, భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### పోలీసు స్టేషన్ ఎదుట

## మృతుడి తండ్రి ఆత్మహత్యాయత్నం

### - సుమంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: బంగారుపాళ్యం పోలీస్‌స్టేషన్ ఎదుట ఓ దళిత యువకుడి మృతిపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి తండ్రి గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సదకుప్పం గ్రామ సమీపంలోని ఓ మామిడితోటలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో మనోజ్(24) మృతి చెందడంతో ఈ విషయంపై తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుడి కుటుంబసభ్యులు దళితులతో కలిసి పోలీస్ స్టేషన్ ఎదుట మధ్యాహ్నం నుండి రాత్రి వరకు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుడి తండ్రి సుబ్రమణ్యం ఓ దశలో న్యాయం కోసం ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించాడు. సత్వరం స్పందించిన కుటుంబసభ్యులు, పోలీసులు ఆత్మహత్యాయత్నంను అడ్డుకున్నారు. వివరాలిలా వున్నాయి. సదకుప్పం గ్రామానికి చెందిన సుమంత్‌రెడ్డి తన ట్రాక్టర్ ద్వారా మామిడి తోటకు పురుగుల మందు కూలీలతో పిచికారి చేయించేవాడు. బుధవారం పురుగుల మందు పిచికారి చేయడానికి సదకుప్పం దళితవాడకు చెందిన మనోజ్, జానకిరామ్, రామ్‌చరణ్, రాజాసింహాలను కూలీలుగా తీసుకెళ్ళాడు. మధ్యాహ్నం వరకు మామిడితోటలో మందు పిచికారి చేసిన కూలీలు భోజనం కోసం ఇంటికి వెళ్ళారు. తిరిగి మందు పిచికారి చేయడానికి తోటలోకి రాగా మనోజ్‌పై జానకిరామ్, రామ్‌చరణ్, రాజసింహలు దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన మనోజ్‌ను చికిత్స నిమిత్తం అరగొంగ అపోలో ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందాడు. ఘర్షణ పడిన విషయంను సుమంత్‌రెడ్డి మనోజ్ తల్లిదండ్రులకు తెలియపరచగా మీ పిల్లవాడు ముర్ఛతో కింద పడ్డాడని చెప్పాడు. సుమంత్ అపద్దం చెప్పాడని బాధితులు ఆరోపించారు. ఈ విషయంపై పోలీసులు సుమంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై మృతుడి కుటుంబీకులు పట్టువీడకుండా రోడ్డుపైనే బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఒక దశలో శాంతిభద్రతలకు విఘాతం కలిగే విధంగా పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం తెలిసిన వెంటనే పలమనేరు డిఎస్పీ డేగల ప్రభాకర్ పోలీస్ స్టేషన్ చేరుకుని మృతుడి కుటుంబీకులు, ఆందోళన కారులతో చర్చించారు. మీరు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ వారు పట్టించుకోలేదు. మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌పి ధరణి, జనార్ధన్‌గౌడ్‌లు, సింగిల్‌విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, పలువురు దేశం నాయకులు ఆందోళనకారులతో చర్చించారు. ఒక దశలో పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ బాధితులకు ఫోన్ చేసి నిందితులకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చినా వారు అంగీకరించలేదు. దీంతో చిత్తూరు వన్‌టౌన్, టుటౌన్, పలమనేరు అర్బన్, రూరల్ ఇన్స్‌పెక్టర్లు మహేశ్వర్, నెట్టికంఠయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రశాంత్, స్థానిక సిఐ కత్తి శ్రీనివాసులుతో పాటు అదనపు బలగాలను డిఎస్పీ రప్పించారు. ఆందోళనకారులను పోలీసులు ఎంత నచ్చజెప్పినా తమ ఆందోళనను విరమించేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

## శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 10 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పరిశీలించారు.ఆలయంలోనూ, పరిసరాల్లో చేపట్టి ఏర్పాట్లు సదుపాయాల గురించి ఇఓ బాపిరెడ్డి ఎంఎల్ఏకు వివరించారు.ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన లైటింగ్‌ను పరిశీలించారు. చేపట్టబోయే పూల అలంకరణల గురించి ఇఓ వివరించారు. అలాగే విఐపిల క్యూలైన్లు, సాధారణ భక్తులకు ఏర్పాటు చేయబోయే క్యూలైన్లను గురించి ఇఓబాపిరెడ్డి ఇఇ శ్రీనివాసులురెడ్డిలు వివరించారు. కాగా ఆలయం లోపల ఏర్పాటు చేసిన ముగ్గులను, దక్షిణ గోపురం నుంచి అలాగే శివయ్య గోపురం నుంచి వచ్చే భక్తులకు కల్పించిన సదుపాయాలను వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లును, స్నానఘట్టాలను గురించి ఎంఎల్ఏకు వివరించారు. ఎంఎల్ఏతో పాటు మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు బోర్డు సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి,పగడాల మురళి,సుబ్రమణ్యం స్వామి ఆలయ ఛైర్మెన్ బుజ్జి శ్రీకాళహస్తి మండల పార్టీ అధ్యక్షుడు అక్షింత కృష్ణయాదవ్, సిఐ ప్రకాష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

# సీటు వదలను... నేను కదలను.

### రిజిస్ట్రార్‌గా తొలగించినా కదలని భాస్కరుడు.
### నూతన ఇంచార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తారకరామ కుమార శర్మ నియామకం
### వేదిక వర్శిటీలో గందరగోళం



తిరుపతి విద్య ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ వివాదాలకు స్థావరంగా మారింది.ఎంతో పవిత్రమైన వేద విద్యకు నిలయంగా మారిని వర్సిటీలో రాజక్రీడలు రాజ్యమేలుతున్నాయి.ఇటీవల వీసీని నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తూ టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి నివేధించిందని వార్తలు హల్ చల్ చేశాయి. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోగా,గవర్నర్ నుంచి సైతం ఎటువంటి నిర్ణయం వెలువడలేదు.దీంతో ప్రస్తుతం వీసీగా రాణి సదాశివమూర్తి కొనసాగుతున్నారు. ఆయన నియామకం పైనా, తొలగిస్తూ బోర్డు నిర్ణయం తీసుకోవడంపై వీసీ హైకోర్టును సంప్రదించారు.

**కుట్రలు కుతంత్రాలే ఆయన నైజం .**

దేశ,విదేశాల నుంచి వేద విద్యకోసం వర్సిటీకి విచ్చేస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ ఎంతో మందికి ఉపాధి ఉద్యోగావకాశాలను కల్పిస్తున్న వేదిక్ వర్సిటీలో ఏడాదిగా ముసలం చుట్టుకుంది. ఇందుకు ప్రధాన కారణం ప్రస్తుత రిజిస్ట్రార్ ఉన్న వ్యక్తి అంటూ వర్సిటీలో పెద్ద ఎత్తున అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు వాపోతున్నారు. ప్రశాంతంగా ఉన్న వర్సిటీని ఆయన ఒంటెద్దు పోకడలతో,రాజకీయ పలుకుబడితో ఇటు అధ్యాపకులపైనా, అటు వీసీస్థాయి అధికారులపై ఉన్నతాధికారులకు ప్రభుత్వానికి కుట్ర పూరితంగా తప్పుడు సమాచారం అందించడంతో వివాదం నెలకొన్నట్లు సమాచారం.వర్సిటీలో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైల్స్ని సైతం తన టేబుల్ పైనే ఉంచుకునే కాలక్షేపం చేస్తున్నట్లు సమాచారం. దీంతో వర్సిటీ అభివృద్ధిని అడ్డుతగులుతున్న రిజిస్ట్రార్‌ను తొలగిస్తూ వీసీ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

**వెళ్ళనంటూ భీష్మించుక కూర్చున్న భాస్కరుడు.**

వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్గా కొనసాగుతున్న భాస్కరుడును వీసీ తొలగించిన నేపథ్యంలో ఆయన సీటు నుంచి కదలంటూ భీష్మించుక కూర్చొన్నాడు. రిజిస్ట్రార్ ఆయననుతొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను సైతం ఆయన బేకాతర్ చేస్తూ నేను వెళ్లనంటే వెళ్లనంటూ గురువారం యధావిధిగా ఆయన స్థానంలో ఆశీనులయ్యారు. ఆయనను తొలగించిన నేపథ్యంలో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మధర్ డిపార్ట్మెంట్లో గురువారం రిపోర్ట్ చేయాల్సి ఉంది. కానీ వెళ్లకుండా మొండికేసి వర్సిటీలోనే రిజిస్ట్రార్ కూర్చీలో కూర్చొని ఉండిపోయారు.ఆయన వ్యవహారశైలిపై వర్సిటీఅధికారులు, అధ్యాపకులు పలురకాలుగా చర్చించుకుంటున్నారు.

**నూతన రిజిస్ట్రార్‌గా తారకరామ కుమార శర్మ.**

రిజిస్ట్రార్ వ్యహారశైలితో విసిగిపోయిన వర్సిటీ అధికారులు వర్సిటీ అభివృద్ధిని ఆకాంక్షి ంచి నూతన ఇంచార్జి రిజిస్ట్రార్ క్రిష్ణ యజుర్వేద విభాగం ప్రొఫెసర్ కే తారకరామ కుమార శర్మను నియమించారు. గురువారం ఆయన ఇంచార్జి రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. కానీ గత రిజిస్ట్రార్ సీటును వదలక పోవడంతో బాధ్యతలు చేపట్టలేక పోయారు.

## కార్యకర్త కుటుంబానికి 3లక్షల చెక్కు అందజేత

శాంతిపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



మండలంలోని తుమ్మిశి గ్రామంకు చెందిన తెదేపా కార్యకర్త బాలు ఆకస్మిక మరణం చెందాడు. దీంతో సిఎం చంద్రబాబునాయుడు ప్రకటించిన మేరకు మూడు లక్షల రూపాయల చెక్కును గురువారం టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కార్మిక బోర్డు సభ్యుడు విశ్వనాథ్‌నాయుడు, పిఎసిఎస్ ఛైర్మన్ గోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రాజేంద్ర ప్రసాద్ లు బాధిత కుటుంబానికి అందజేశారు.

## నేడు నారా భువనమ్మ శాంతిపురం రాక

కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి శుక్రవారం శాంతిపురం మండలంకు విచ్చేయనున్నారు. ఈపర్యటన పూర్తి ప్రైవేట్ కార్యక్రమంగా కొనసాగనున్నట్లు తెలిసింది. శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి సమీపంలో శుక్రవారంఓ ప్రైవేట్ మిల్ 7 ప్రొడక్ట్ కంపెనీ ప్రారంభించనున్నారు. అలాగే వి.కోటలోజరిగే ఓ వివాహ రిసెప్షన్ కార్యక్రమంకు సైతం హాజరవుతారని సమాచారం.

## పెద్దపంజాణి తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రామ్మూర్తి



పెద్దపంజాణి జనవరి 5 ప్రభాతవార్త: పెద్దపంజాణి మండలం నూతన తాశీల్దారుగా రామ్మూర్తి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇదివరకు చౌడేపల్లి ఉప తాహాశీల్దారుగా పనిచేస్తూ పదోన్నతి పై పెద్దపంజాణి మండల తాశీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు,అధికారుల సహకారంతో ప్రజలకు రెవెన్యూ శాఖ ద్వారా మెరుగైన సేవలు అందేలా చూస్తామని ఆయన పేర్కొన్నారు. కాగా మండలంలో ఏడాదన్నర కాలంలో నలుగురు తాహాశీల్దారులు బదిలీ కాగా ఐదో వ్యక్తిగా రామ్మూర్తి బాధ్యతలు చేపట్టడం విశేషం.

## అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉచిత విద్యకు ఆహ్వానం

పలమనేరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త:

తిరుపతి జిల్లా పుత్తూరు మండలం గోపాలక్రిష్ణాపురం వద్ద అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉచిత విద్యకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎపి సాంఘిక సంక్షేమ శాఖ విద్యాలయాల సంస్థ (తాడేపల్లె) అధికారులు ఒప్రకటనలో తెలిపారు. ఏదైనా ప్రభుత్వ పాఠశాలలో 2025-26లో 4వ తరగతి చదివిన వారు 5వ తరగతిలో చేరడానికి మాత్రమే అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 1.09.2013 నుండి 31.08.17 మధ్య జన్మించిన వారై ఉండాలని, బిసి, బిసి సి, ఓసి అభ్యర్థులు 1.09.2015 నుండి 31.08. 2017 మధ్య పుట్టిన వారై ఉండాలని సూచించారు. అలాగే అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్‌లో చేరడానికి 2025-26లో 10వతరగతి మొదటిసారి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అభ్యర్థులు తమ జిల్లాలోని పాఠశాల లేదా కళాశాలలో మాత్రమే ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రెవెన్యూ క్లినిక్‌కు వెలువెత్తిన ఫిర్యాదులు.

చిట్వేలి,ఫిబ్రవరి 5 ,ప్రభాతవార్త:

భూ సమస్యల పరిష్కార వేదికగా వెలుగు కార్యాలయంలో ఆర్డిఓ రామ మోహన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ క్లినిక్ కు ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రజల నుండి భూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలు, రికార్డుల సవరణ, సర్వే సంబంధిత సమస్యలు, వారసత్వ దరఖాస్తులు, ఆధార్ సీడింగ్, తిమ్మాయిపాలెం ఇనాం భూముల సమస్యలు తదితర రెవెన్యూ అంశాలపై మొత్తం 34 వినతిపత్రాలు అధికారులు స్వీకరించారు. స్వీకరించిన ప్రతి అర్జీని ముందుగా రిజిస్టర్‌లో నమోదు చేసి, అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.అనంతరం ఆర్డీఓ అర్జీలను పరిశీలించి, ఆయా సమస్యలపై తగిన ఆదేశాలు జారీ చేయడంతో పాటు, మిగిలిన కేసులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజల సమస్యలను నేరుగా విని పరిష్కార మార్గాలు చూపడం ద్వారా రెవెన్యూ క్లినిక్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీమతి పి. స్పందన , మండల సర్వేయర్ జి. త్యాగరాజు ,మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ యు.నిఖిల్ కుమార్ ,గ్రామ సర్వేయర్లు, వీఆర్ఓలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొని క్లినిక్‌ను సజావుగా నిర్వహించారు.

## టాలెంట్ ఫెస్ట్‌కు విశేష స్పందన.

తిరుపతి విద్య ఫిబ్రవరి 5 ప్రభాత వార్త



జాతీయ సంస్కృత వర్సిటీలో రెండు రోజులుగా జరుగుతున్న నేషనల్ సాంస్క్రిట్ స్టూడెంట్స్ ఫెస్ట్2026కు విశేష స్పందన లభించింది.వర్సిటీలో రెండవ రోజు దేశంలోని 24 యూనివర్సిటీల నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని వారి శాస్త్ర ప్రతిభను చాటుకున్నారు.ఇందులో భాగంగా గురువారం జరిగిన ప్రతిభా పోటీలలో వేదభాష్య భాషణ,వ్యాకరణశాస్త్ర భాషణ,సాహిత్యశాస్త్ర భాషణ,వేదాంత శాస్త్ర భాషణ, జ్యోతిషశాస్త్ర భాషణ పోటీలను నిర్వహించారు.ఈ పోటీలకు వివిధ ఈ పోటీలకు వివిధ విద్వాంసులు,పండితులు హాజరై విద్యార్థులోని ప్రతిభను పరీక్షి ంచారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం జరిగే ముగింపు కార్యక్రమంలో అవార్డులు, బహుమతులను అందజేయనున్నారు. ఈ ప్రతిభ సమారోహానికి కోఆర్డినేటర్స్ గా సాహిత్య విభాగ సహాచార్యులు డాక్టర్ భరత్ భూషణ్ రత్, డాక్టర్ ప్రదీప్ కుమార్ భాగ్, అడిషనల్ కోఆర్డినేటర్గా వ్యాకరణ విభాగ అధ్యాపకులు డాక్టర్ ఉదయన హెగ్డే వ్యవహరించారు.

## కౌన్సెలింగ్ ఆవశ్యకతపై వర్క్ షాప్

తిరుపతి విద్య, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



ఎస్‌విఆర్ట్స్ కళాశాల సైకాలజీ విభాగం,అంతర్జాతీయ సైకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఆవశ్యకత అనే అంశం మీద ఒకరోజు వర్క్ షాప్ ఘనంగా జరిగింది. సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉమారాణి చొరవ తీసుకొని ప్రస్తుతం కొంతమంది యువత మానసిక సమస్యలతో ఆత్మహత్యలు చేసుకుంటారని కలత చెందుతూ వాటి నివారణకు కౌన్సిలింగ్ ఎంతో అవసరం అని వివరించారు. డాక్టర్ సుధారాణి కోకన్వీనర్‌గా వ్యవరించారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి,అంతర్జాతీయ సైకాలజిస్టుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ డి గోవిందరెడ్డి, అమర హాస్పిటల్ సైకాలజిస్టు డాక్టర్ అనుపమ, ఎస్ పి డబ్ల్యూ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ భువనేశ్వరి చక్కటి సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కిషన్, భీమన్న, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం, విజయశ్రీ, ఉష, వాణి, తేజోవాణి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## ఇంటి పన్నును ఆన్లైన్ ద్వారానే చెల్లించాలి

జివి నారాయణరెడ్డి



రైల్వేకోడూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల గ్రామపంచాయతీ వారు ఇంటి పన్నులను ఆన్లైన్ ద్వారానే చెల్లించాలని స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డు అధికారి జివి నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అధికారులతో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం సచివాలయం ద్వారా చేపడుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, అక్షరాంధ్ర ఈ కేవైసీ మరియు ఇంటి పన్నుల వసూళ్ల మొదలగు అంశములపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ఈనెల 10వ తేదీలోగా అందరూ సచివాలయ సిబ్బంది పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే అక్షరాంధ్ర వాలంటరీ రిజిస్ట్రేషన్ వెంటనే పూర్తిచేయాలని తెలియజేశారు. సచివాలయ సిబ్బంది ఇంటి పన్ను వసూల విషయమై ఇంటి పన్నును నగదు రూపంలో కాకుండా ఆన్లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలని తెలియజేశారు. ఒకవేళ ఆన్లైన్ లేకుంటే ఫోన్పే ద్వారా చెల్లించవచ్చని తెలియజేశారు. చెల్లించిన వారికి రసీదు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి మరియుమండలస్వర్ణగ్రామ అధికారిని, పంచాయతీ కార్యదర్శులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్‌విఆర్ట్స్ కళాశాల విద్యార్థికి ప్రతిభ అవార్డు



*తిరుపతి విద్య, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త* ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో వర్సిటీలో జరిగిన రైజింగ్ స్టార్ 2026 మెరిటోరియస్ అవార్డుల ప్రధానోత్సవంలో ఎస్ వి ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎస్ హాసన్ వలి కి ఎస్ వి యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ టీ నరసింగరావు చేతులు మీదగా అవార్డు అందుకున్నారు.. డిగ్రీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించడంతో పాటు ఎక్స్ట్రా కరికులర్ యాక్టివిటీస్ నందు ఉత్తమ ప్రతిభ కనబరిచి అవార్డులు కైవసం చేసుకోవడం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి,తెలుగు శాఖ అధ్యక్షులు భీమన్న,అధ్యాపకులు అభినందించారు.

## మద్యం సేవించి వాహనాలు నడుపుతూ

పట్టుబడిన వారికి రూ.1.40 లక్షలు జరిమానా

**చిత్తూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో బుధవారం పట్టుబడిన 14 మందికి కోర్టులో హాజరు పరిస్తే జడ్జి కావలి నాగరాజు రూ.1.40 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు బుధవారం వివిధ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించిన సమయంలో మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతూ 14 మంది వ్యక్తులు పట్టుబడ్డారని ట్రాఫిక్ ఇన్స్ ప్టెర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. వీరిని గురువారం కోర్టుకు హాజరుపరిస్తే జడ్జి కావలి నాగరాజు ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున 14 మందికి రూ.1.40 లక్షలు జరిమానా విధించడం జరిగిందన్నారు.

## టెక్నాలజీ బేస్ట్ వెస్ట్ మేనేజ్‌మెంట్ శిక్షణకు 8 మంది శానిటరీ ఇన్స్‌పెక్టర్లు

**చిత్తూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రారంభమైన టెక్నాలజీ బేస్ట్ వెస్ట్ మేనేజ్‌మెంట్ అంశంపై శిక్షణకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ నుండి 8 మంది ఇన్‌ఛార్జీ శానిటరీ ఇన్స్ పెక్టర్లు, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు, అనిమిటీ కార్యదర్శులు వెళ్ళారని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌లు తెలిపారు. ఈ విషయంపై వారు మాట్లాడుతూ హైదరాబాద్‌లో టెక్నాలజీ బేస్ట్ వెస్ట్ మేనేజ మెంట్ అంశంపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 3 రోజుల శిక్షణ కార్యక్రమం జరుగుతున్నదన్నారు. ఈ శిక్షణలో నగరంలో ఎఫ్ఎస్‌టి, ఎఫ్ఎస్టీసిఎస్‌ల నిర్వహణ, సాంకేతికతతో శానిటేషన్ కార్యక్రమాల అమలుపై ఇన్‌ఛార్జీ శానిటరీ ఇన్స్ పెక్టర్లు, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులకు శిక్షణ ఇస్తారన్నారు.

## రేపు హజ్ యాత్రికులకు హెల్త్ ఫిట్‌నెస్ కార్యక్రమం

**చిత్తూరు, ఫిబ్రవరి 26 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా నుండి 2026 సంవత్సరం హజ్ యాత్రకు వెళ్ళే ముస్లీంలకు శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ జారీ చేస్తారని జిల్లా హజ్ కమిటీ సభ్యులు ఉబేద్ షరీఫ్ తెలిపారు. ఈ మేరకు చిత్తూరు జిల్లా నుండి హజ్ యాత్రకు తరలివెళ్ళే ముస్లీంలు శనివారం ఉదయం 9 గంటలకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే హెల్త్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు. ఈ హెల్త్ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కార్యక్రమం పూర్తయిన అనంతరం హజ్ యాత్రికులకు అదే రోజు లేదా వైద్యాధికారుల సలహా మేరకు మరుసటి రోజు వాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

## పిఎం శ్రమయోగి మాన్ ధన్‌పై విస్తృతంగా అవగాహన

– డిఆర్ఓ మోహన్‌కుమార్



**చిత్తూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి శ్రమయోగి మాన్ ధన్, ప్రధానమంత్రి లఘు వ్యాపారి మాన్ ధన్ పథకాలపై విస్తృతంగా అవగాహన నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్ అన్నారు. డిఆర్ఓ ఛాంబర్‌లోని సమావేశభవనంలో శుక్రవారం జిల్లా కార్మికశాఖ ఆధ్వర్యంలో అసంఘటిత కార్మికుల సాంఘీక భద్రత చట్టంకు సంబంధించి రెండు పథకాల అమలుపై డిఆర్ఓ మోహన్‌కుమార్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మాట్లాడుతూ అసంఘటిక కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందని, వాటిపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి శ్రమయోగి మాన్ ధన్ పెన్షన్ పథకానికి వీధుల్లో బండ్లపై అమ్మేవారు, రిక్షా కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, వ్యవసాయ కూలీలు, మధ్యాహ్న భోజనం వర్కర్లు, బీడి పని వారు, ఇటుక బట్టీల్లో పని చేసేవారు, చేనేత పనివారు, ఇండ్లలో పనిచేసే వారు అర్హులన్నారు. అలాగే నెలసరి ఆదాయం రూ.15 వేలులోపు కలిగి వున్న వారందరు ఈ పథకానికి అర్హులన్నారు. అలాగే ప్రధానమంత్రి లఘు వ్యాపారి మాన్ ధన్ పథకానికి స్వయం ఉపాధిదారులు, దుకాణ యాజమానులు, రీటైల్ వ్యాపారుల, రైస్‌మిల్లు యాజమానులు, ఆయిల్‌మిల్లు యాజమానులు, కమీషన్ ఏజెంట్లు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు, చిన్న హోటళ్ళ యాజమానులు అర్హులన్నారు. అలాగే ఆదాయపు పన్ను చెల్లించని వారు, వార్షిక టర్నోవర్ రూ.1.50 కోట్లు వున్న వారు అర్హులన్నారు. ఈ సమావేశంలో లేబర్ అసిస్టెంట్ కమీషనర్ ఆలోచన, అధికారులు ఆనందబాబు, రాజయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల బకాయిలపై బడ్జెట్‌లో పరిష్కారం చూపాలి

- ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య



**కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** రాష్ట్రం లోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల బకాయిలపై ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో పరిష్కారం చూపాలని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన తమ డిమాండ్లకుసంబంధించిన వినతి పత్రాన్ని స్థానిక తెదేపా కార్యాలయంలో ప్రభుత్వవిప్‌డా॥ కంచర్ల శ్రీకాంత్ పిఏ విష్వక్‌కు అందించారు. ఆర్థిక ప్రయోజనాలు సుమారు 35వేల కోట్లకు చేరుతున్న నేపథ్య ంలో బడ్జెట్‌లో నిర్దిష్టమైన కేటాయింపులు చేపట్టాలని లేకుంటే ప్రత్యామ్నాయ పరిష్కారం చూపాలని ఆయన పేర్కొన్నారు. వేతన సవరణ, నాలుగువిడతలడిఏ చెల్లింపు, సరెండర్ లీవుల చెల్లింపులు జరపాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వేలకోట్లు ప్రభుత్వం చెల్లించలేని స్థితిలో ఉన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా బాకీకి భూమి అనే ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పి స్తామన్నారు. వేతన సవరణ కమీషన్‌ను వెంటనే నియమించాలని ప్రభుత్వాన్నికోరారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దేవినేని నరేష్‌బాబు,చలపతి, కుప్పం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు మధు, ఉదయ్ కుమార్, చిత్తూరు,బంగారుపాళ్యం తాలూకా అధ్యక్షులు మోహన్, సురేంద్రనాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రెస్కో పాలకవర్గంచే ఘన సన్మానం

కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



కుప్పంలో చేపట్టిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు హాజరైన ఛైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తిని రెస్కో పాలకవర్గం తరపున రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్ ఘనంగా సత్కరించారు. ఈస ందర్భంగా విశ్రాంత జడ్జి మాట్లాడుతూ రెస్కో పాలకవర్గం ప్రజ లకు మరింత మెరుగైన సేవలు అందించాలని వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో రెస్కో ఎండి సోమశేఖర్, రెస్కో డైరెక్టర్లు అమీర్, తులసినాథ్, శివతేవర్, హరోగరన్, బసవరాజు, వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.

## ద్రవిడ షటిల్ బాడ్మింటన్ టోర్నీ ప్రారంభం



**కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** ద్రవిడ వర్సిటీ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ క్లబ్ అధ్వర్యంలో ద్రవిడ వర్సిటీలో బాడ్మింటన్ టోర్నీని వైస్‌చాన ్సలర్ ఆచార్య ఎం. దొరస్వామి ప్రారంభించారు. ఈసందర్భంగా విసి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ ్చన్నారు. లయన్స్‌క్లబ్ సలహాదారు మహేష్ మాట్లాడుతూ పిల్లలను ప్రోత్సహించేందుకే వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెపా ్రరు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కిరణ్‌కుమార్,డా॥ పళని, సభ్యులు వరదరాజులు, సంపంగి, రవి, పాల్‌రాజ్, లెనిన్ పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



**కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి పిసి సా ంబశివం పేర్కొన్నారు. గురువారం మండలంలోని మల్లానూరు రైతు సేవా కేం ద్రంలో రైతులకు రాయితీతో యూరియా, టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. రైతులు ప్రభుత్వ పథకాలు, రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కడ సభ్యుడు రామచంద్ర, నేతలు విభూషణ్, దాము, రమేష్, నాగు, రాజ్‌కుమార్, కల్తై, వెంకటప్ప, ఎఎంసి భరత్, రైతులు పాల్గొన్నారు.

## గురుకులంలో కడ పి.డి.. పికెఎం ఉడాఛైర్మన్ తనిఖీలు



**గుడుపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** మండలంలోని కస్తూరిబా గురుకులం, ఎపి మోడల్ స్కూల్‌లో గురువారం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, పికెఎం ఉడా ఛైర్మన్‌డా॥ బిఆర్ సురేష్‌బాబు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులకు అందిస్తున్న పౌష్టికాహారం, మరుగుదొడ్లను పరిశీలించారు. ఉపాధ్యాయుల పనితీరు, సమస్యలను నేరుగా విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థినుల ఆరోగ్య రికార్డులపై సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ బాలికల విద్య, ఆరోగ్యం, భ ద్రత ఎంతో ముఖ్యమన్నారు. బాల్యవివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ ఆర్.చంద్రశేఖర్, కడసభ్యుడు వెంకటేష్, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, కార్పోరేషన్ డైరెక్టర్ హేమా ంబరగౌడు,నేతలు ఎస్ఆర్ చంద్ర, ప్రకాష్, సర ్పంచ్ గోపాల్, అధికారులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## కోడి పందేళ్ళ స్థావరంపై మెరుపు దాడి

*-13మందిపై కేసు నమోదు*



*చౌడేపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త* కోడి పందేళ్ళ స్థావరంపై పోలీసులు మెరుపుదాడి చేసారు. దాడిలో పలువురు పందేగాళ్ళను అదుపులోకి తీసుకొన్నారు. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు... మండలంలోని దిగువపల్లి పంచాయతీ బోయకొండ సమీపంలోని వికె రెసిడెన్సీ వెనుక భాగంలో కోడిపందేళ్ళు ఆడుతు న్నట్లు సమాచారం వచ్చింది. మదనపల్లి డిఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో డ్రోన్ కెమరానుపయోగించి స్థావరంపై దాడి చేసారు. ఈ దాడిలో 13మందిని అదుపులోకి తీసుకొని రూ. 25వేలు నగదు, 6కోళ్ళు, 11టూవీర్లను స్వాధీన పరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. మదనపల్లి డిఎస్పీ ఆధ్వర్యంలో డ్రోన్ కెమరానుపయోగించి అసాంఘీక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని ఈ సందర్భంగా ఆయన అన్నారు. అదే విధంగా అక్కడే వున్న నాగరాజ వద్ద నాటు తుపాకీని స్వాధీన పరచుకొని అక్రమంగా ఆయుధం కల్గివున్నట్లుగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## అభిషేక ప్రియా మృత్యుంజయా...!



**చౌడేపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** కోరివారి కొంగు బంగారం మృత్యువును జయించే శక్తినిచ్చే దేవదేవునికి గురువారంవిశేషపూజలునిర్వహించారు. స్థానిక మృత్యుం జయేశ్వరాలయంలో ప్రధానార్చకుడు రాజశేకర్ దీక్షితుల ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయాన్నే అభిషే కము, అలంకరణ గావించారు. మాఘమాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారి పవిత్ర తీర్థప్రసా దాలందించారు

## శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు



*చిత్తూరురూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:* చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ దంపతులు గిరిం పేట లోని శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసారు. గురువారం వివాహ వార్షికోత్సవంను పుర స్కరించుకొని సతీమణి ప్రతిమ గురజాలతో కలసి శ్రీదుర్గమ్మను, అనంతరం ఎదురుగా గల శివాల యంలోని శివగామి సుందరి అమ్మసమేత చిదంబరస్వామివారిని దర్శించుకొన్నారు. ఆలయ అర్చకులు, స్థానిక నాయకులు ఎమ్మెల్యే దంపతులకు పూర్ణకుంభస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసారు. దర్శనం, పూజా కార్యక్రమాలననంతరం అర్చకులు ఎమ్మెల్యే దంపతులను ఆశీర్వదించగా, స్థానిక నాయకులు శాలువ, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమినాయకులు పాల్గొన్నారు.

## హెల్మెట్ లేకుంటే ఫైన్ కట్టాల్సిందే



**బైరెడ్డిపల్లి ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** బైరెడ్డిపల్లి మండలంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ఫైన్ తప్పదని,బైరెడ్డిపల్లి మండల పోలీసులు తెలియజేస్తున్నారు.ఈ క్రమంలో ద్విచక్ర వాహనంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురికి ఫైన్లు వేయడం జరిగినది.హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ప్రాణాపాయం కలగవచ్చునని,కుటుంబాన్ని మనసులో ఉంచుకొని హెల్మెట్ ను తప్పకుండా ధరించాలని,వాహనానికి చెందిన ఒరిజినల్ పేపర్స్ దగ్గరే ఉంచుకోవాలని,డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా ఉండాలని,మద్యం సేవించి వాహనాన్ని నడపరాదని, ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ చందన ప్రియ తెలియజేశారు.

## నేడు అర్ధగిరి ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం

-భారీగా ఏర్పాట్లు



**తవణంపల్లె, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం గురువారం ఆట్టహాసంగా నిర్వహించడానికి దేవస్థానం వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనంతరం గతనెల 12న ఎ.రఘుపతి (టీడీ పీ), వినాయకం (టీడీపీ) సు బ్రమణ్యం(టీడీపీ), విభాకరశాస్త్రి ( ఆలయ మాజీ అర్చకులు), శోభ( టీడీపీ). ధనలక్ష్మీ(టీడీపీ), కె.భాగ్యలక్ష్మీ(టీడీపీ) శ్రీధర్‌నాయుడు (టీడీపీ). రాధిక(జనసేన), ఎ.గుణ(బిజెపీ)లను పాలకమండలి సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదరి ్శ హరి జవహర్‌లాల్ ఉత్తర్వులు జారి చేశారు. ఈమేరకు పాలకమండలి ఛైర్మన్ ఎ.రఘుపతితో పాటు సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకోసం దేవస్థానం వద్ద భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈకార్యక్రమానికి పూతలపట్టు, చిత్తూరు, చంద్రగిరి ఎమ్మెల్యేలు కలికిరి మురళీమోహన్, గురుజాల జగన్మోహన్,పులివర్తి నాని, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. అలాగే పూతలపట్టు నియోజకవర్గం పరిధిలోని కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హాజరుకానుండడంతో ఛైర్మన్ రఘుపతి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈసందర్భంగా అరగొండ సినిమా థియేటర్ వద్ద నుండి భారీ ర్యాలీగా బయలుదేరి పాతబస్టాండు వద్దకు చేరుకుని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి,కొత్త బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు.అనంతరం ర్యాలీ ఆలయం వద్దకు చేరుకోనుంది.అక్కడ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం అనంతరం కొలువుదీరనుంది.

***ప్రమాణ స్వీకారం విజయవంతం చేయండి:*** ఛైర్మన్ ఎ.రఘుపతి అర్ధగిరి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పాలకమండలి ఛైర్మన్‌గా నియమితులైన ఎ,రఘుపతి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పూతలపట్టు ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగే ప్రమాణ స్వీకార కార్యక్రమంకు నియోజకవర్గంలోని కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్దఎత్తున హాజరు కానున్నట్లు తెలిపారు,ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కుష్ఠువ్యాధిపై అవగాహన కార్యక్రమం



**యర్రావారిపాలెం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త** యర్రావారిపాలెం మండలం నెరబైలు పి హెచ్ సి డాక్టర్ సుమంత్ చింతగుంట నెరబైలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి అనేది మైకోబ్యాక్టీరియా లెప్రే బ్యాక్టీరియా వల్ల చర్మం నరాలు మరియు కళ్ల ను ప్రభావితం చేసే దీర్ఘకాళిక అంటువ్యాధి. కానీ మన ప్రజల్లో ఉన్న అపోహ లాగా అంటుకునే వ్యాధి కాదు అనితెలిపారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే ఎలాంటి వైకల్యం రాదని తెలిపారు. కుష్ఠువ్యాధి అంటువ్యాది కాదు, తాకడం వల్ల రాదని సుమంత్ తెలిపారు.ప్రాథమిక దశలో గుర్తించి తగిన చికిత్స సకాలంలో తీసుకుంటే కుష్ఠువ్యాది, క్యాన్సర్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చు అని డాక్టర్ సుమంత్ తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

**కల్లూరు, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త** మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 7వ తేది శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ జి. రాజశేఖర్ బాబు తెలిపారు. ఈ సమావేశం ఎంపిడిఓ కార్యాలయంలో ఈ నెల 7వ తేది శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందువల్ల మండల ప్రజా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

## చిత్తూరు జిల్లా బిజెపి కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా మురళి ఎంపిక



*గంగాధర నెల్లూరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:* ఇటీవల జిల్లాలో నిర్వహించిన చిత్తూరు జిల్లా భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఎంపికలో భాగంగా గంగాధర నెల్లూరు మండలానికి చెందిన ఎం.మరళిని చిత్తూరు జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఎ.విజయభాస్కర్ రెడ్డిని కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు చిత్తూరు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు సుధీర్ కుమార్ రెడ్డి ఒప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ గతంలో మండల అధ్యక్ష పదవిని చేపట్టి మండలంలో బిజెపి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పార్టీకోసం కష్టపడే వారిని గుర్తించి జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం సంతోషదాయకమని దీనికి తోడ్పడిన ప్రతి ఎక్కరికి కృతజ్ఞతలు తెలిచజేస్తున్నామని ఇకపై జిల్లా స్థాయిలో పార్టీ పటిష్టానికి తన వంతు కృషి చేస్తామని అన్నారు.మండల బిజెపి కార్యవర్గ సభ్యులు మురళి విజయభాస్కర్ రెడ్డిల ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారంకే ప్రత్యేక అదాలత్

- విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి



**కుప్పం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం(రెస్కో)పరిధిలో విద్యుత్ వినియోగదారుల సమస్యలపరిష్కారంకే ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లు నిర్వహిస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులసమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) ఛైర్‌పర్సన్, వి శ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి పేర్కొన్నారు. గురువారం రెస్కో కేంద్ర కార్యాలయంలో రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, రెస్కో మేనేజి ంగ్‌డైరెక్టర్ సోమశేఖర్‌ల నేతృత్వంలో విశ్రాంత జడ్జి ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా 18మంది వినియోగదారులు బిల్లు రివిజన్,సర్వీసుల తొలగింపు, పేరుమార్పు, లైన్‌మార్పు,లైను తొలగింపులపై 18 వినతిపత్రాలను అందించారు. వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికై తగు ఆదేశాలు జారీ చేశారు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలుఅందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు మధుకుమార్, సా ంకేతిక సభ్యులు శ్రీనివాసబాబు,రెస్కో డైరెక్టర్లు అమీర్, తులసినాథ్, శివతేవర్, హరోగరన్, బసవరాజు, వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ కట్టడాలు తొలగింపు

వార్త కు స్పందన

**తొట్టంబేడు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** కాలువపై అక్రమ కట్టడాలు అనే శీర్షిక వెలువడిన విషయం అందరికీ విధేయతమే. తొట్టంబేడు మండలం ఇటు బసవయ్య పాలెం అటు కన్నలి కి మధ్యలో ఉన్న సర్వే నంబర్ 228/7 ఓ రైస్ మిల్లు వద్ద కాలువపై అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారన్న వార్తపై స్పందనకు అధికారులు స్పందించి అక్రమ కట్టడాలను తొలగించారు.

## దోమల నివారణకు ఫాగింగ్

తొట్టంబేడు, ఫిబ్రవరి 5 ప్రభాత వార్త

మండలంలోని తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం,ఎల్ఐసి కాలనీ , బంగారమ్మ కాలనీ, చిలక వారి కండ్రిగ, సాయిబాబా వీధి, తొట్టంబేడు గ్రామాల్లో దోమల నివారణకు గ్రామ పంచాయతీ కార్యదర్శి హరిప్రియ, సర్పంచ్ సుబ్బయ్య ఆధ్వర్యంలో గురువారం ఫాగింగ్ చేయించారు. దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు పంచాయతీ సిబ్బందికి విన్నవించారు. ఈ నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణ చర్యలను చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో తల్లి కుమారుడికి గాయాలు



**తొట్టంబేడు ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాలెం కు చెందిన మంజుల అనే మహిళ శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో తమ కుమార్తె కనిష్కా ను వదలడానికి వెళుతుండగా, పుత్తేరి కి చెందిన ముగ్గురు యువకులు పల్సర్ ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మంజుల కాలుకు గాయాలు కాగా, శ్రీనివాస్ మేధాన్స్ తలకు గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి హాస్పటల్ తరలించారు. టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

### తూతూ మంత్రంగా వ్యవహరిస్తున్న తొట్టంబేడు రెవెన్యూ అధికారులు



**తొట్టంబేడు ఫిబ్రవరి 5 ప్రభాత వా ర్త** తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు పంచాయతీ బీ.డీ కాలనీ సమీపంలోని చెన్నై రోడ్డు పక్కన మిలిటరీ భూమి కొనుగోలు పేరుతో చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని చెట్లను నాటుతున్నారు. ఈ భూములు విలువ కోట్ల రూపాయలు విలువ చేస్తుంది. అతను మిలిటరీ పేరుతో 5 ఎకరాలు భూమి కొనుగోలు చేశాడు. ఆ భూమి చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు అన్నింటినీ ఆక్రమించుకొని వాళ్ల కుటుంబీకులు పేర్ల మీద సర్వే నెంబర్లను సబ్ డివిజనల్ గా మార్చి ప్రభుత్వ అసైన్మెంట్ భూములను అడ్డదారిలో పట్టాలు సృష్టించినట్లు తొట్టంబేడు తెలుగుదేశం పార్టీ నాయకులు,స్థానికులు ఈ ఆక్రమణలపై విచారణ చేపట్టాలని రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.గత వైసిపి పాలనలో తొట్టంబేడు ఇన్చార్జి తాసిల్దారుగా పనిచేస్తున్న రెవెన్యూ అధికారి ఈ కబ్జాదారుడికి తప్పుడు రికార్డులను సృష్టించి, ఫ్రీహోల్డ్ లో భూములు పెట్టి అప్పనంగా అడ్డదారిలో ఈ భూములకు రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి.ఏది ఏమైనా ప్రభుత్వ డీకేటి భూములును చట్ట ప్రకారంగా అమ్మినా, కొన్నా చెల్లదనే నిబంధన ఉంది. ప్రభుత్వ భూములను సుమారు 25 ఎకరాల్లో చెట్లను నాటుతున్నారు. ఈ ఆక్రమణల పై రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పనులను ఆపమని కూడా చెప్పారు. అయినప్పటికీ సైతం లెక్కచేయకుండా చెట్లు నాటే కార్యక్రమం చేపడుతున్నారు.ఈ ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఇప్పటికే గ్రామస్తులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## రైతులకు పశు దాణ పంపిణీ

పుత్తూరు రూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:

నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు మండలం గోపాలకృష్ణాపురం రైతు సేవా కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజిమాధవయ్య రైతులకు పశువుల దాణ(ఫీడ్)పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షుడు ఆరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి హేమంత్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షులు ఎం.జి.కుమార్, బూత్ కమిటీ కన్వీనర్ హరిగోపాల్, ఆర్గనైజేషన్ సెక్రటరీ భారతి, సి.మునిలక్ష్మి, రామయ్య, రూరల్ కమిటీ కన్వీనర్లు గంగయ్య, జేసీబీ చిన్న, కోట గజపతి, జనసేన డి.గోవర్ధన్, మునేంద్రరెడ్డి, జయరామయ్య, పంచాయతీ సెక్రటరీ రైతు సేవా కేంద్రం ప్రసూన్న, దివాకర్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పబ్లిక్ కి హెల్త్, కాలుష్యంపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 ప్రభాత వార్త :



నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారి ఆదేశాల మేరకు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ గురించి జిల్లా కలెక్టర్ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల కమిషనర్లు, పబ్లిక్ హెల్త్, కాలుష్యం నియంత్రణ మండలి, స్వచ్ఛంద సంస్థ ల తో చర్చించి నివేదికను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, ప్రిన్సిపల్ బెంచ్ న్యూఢిల్లీ వారికి నివేదిక తయారు చేయడంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని అన్ని మున్సిపల్ కమిషనర్లు ఇచ్చే నివేదికను బట్టి తుది నివేదికను తయారు చేసి పంపించాలని తెలిపారు

## డిజిటలైజేషన్‌లో పన్ను నిపుణుల పాత్ర కీలకం

–సలహాదారులకు సత్కారం



తిరుపతి,పిబ్రవరి 5ప్రభాతవార్త:

సూక్ష్మ, చిన్న మధ్యతరహా సంస్థల అకౌంటింగ్ ,నియమావళి అనుసరణ అవసరాలను మెరుగు పరచడంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా స్వీకరిస్తున్న తిరుపతికి చెందిన పన్ను అకౌంటింగ్ నిపుణుల సహకారం గణనీయమని వక్తలు కొనియాడారు. ప్రముఖ వ్యాపార ఆటోమేషన్ సాఫ్ట్‌వేర్ ట్యాలీ సొల్యూషన్స్ అధికారికంగా గుర్తించి అభినందించింది. ప్రాక్టీషనర్లు, అకౌంటెంట్లు, పన్ను న్యాయవాదులు,ఇతర వృత్తిపరుల అసాధారణ సేవలను గౌరవించేందుకు, ట్యాలీ సొల్యూషన్స్ 'టాక్స్ అకౌంటింగ్ టైటాన్స్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమం ద్వారా మూడు విభాగాల్లో మొత్తం తొమ్మిదిమంది ప్రతిభావంతమైన నిపుణులను సత్కరించి, వారు అందించిన విలువైన సేవలు, వృత్తిపట్ల వారి అంకితభావం ప్రశంసించారు. అడిషనల్ కమిషనర్ నాగేంద్ర రీజినల్ ఆడిట్ శర్మ , అప్పిలేట్ అథారిటీ, రవీంద్రనాథ్ రెడ్డి, జాయింట్ కమిషనర్ , చిత్తూరు డివిజన్ సమక్షంలో విజేతలను సత్కరించారు. ఈ కార్యక్రమం మూడు కీలక విభాగాల్లో అత్యుత్తమ సేవలను గుర్తించింది.

## పిల్లల సంరక్షణ సంస్థలు

తిరుపతి,పిబ్రవరి 5ప్రభాతవార్త:

ప్రభుత్వ బాల్య సంక్షేమం,దిద్దుబాటుసేవ సంక్షేమ డైరెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ సూచనలతో తిరుపతి జిల్లా పరిధిలో పనిచేస్తున్న అన్ని పిల్లల సంరక్షణ సంస్థలు తమ సంస్థలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని తెలిపారు.ప్రభుత్వం పూర్తిగా లేదా పాక్షికంగా నిధులు అందించే సంస్థలు, స్వతంత్రంగా నిర్వహించబడుతున్న సంస్థలు సహా ప్రభుత్వం నిర్వహిస్తున్న , ప్రైవేట్‌గా నిర్వహించబడుతున్న అన్ని పిల్లల సంరక్షణ సంస్థలకు ఈ నిబంధన వర్తిస్తుంది.జిల్లాలో అర్హత కలిగిన సంస్థలు రిజిస్ట్రేషన్ కోసం ఫారమ్–27లో దరఖాస్తు పూరించి, అవసరమైన పత్రాలు జతచేయాల్సి ఉంటుంది. 750 రూపాయలు డిడి తీసి ది డైరెక్టర్, .ఎడబ్ల్యుసిఎస్,డబ్ల్యుఎస్‌సి,విజయవాడ పేరున కలిపి ,జిల్లా బాలల సంరక్షణ అధికారి కార్యాలయం, రూమ్ నెం. 519, కలెక్టరేట్ కార్యాలయం, తిరుపతికి ఈనెల 13వతేదీ లోపు సమర్పించవలసిందిగా తెలియజేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఏ సంస్థ కూడా చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌గా కొనసాగేందుకు అనుమతి లేదు. గడువు అనంతరం రిజిస్ట్రేషన్ లేకుండా కొనసాగుతున్న సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేయడమైనది.ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లు తమ సంరక్షణలో ఉన్న పిల్లలకు సురక్షిత వాతావరణం, అవసరమైన సంరక్షణ, సంక్షేమ సేవలు ,చట్టపరమైన ప్రమాణాలు పాటిస్తున్నట్లు నిర్ధారించబడుతుంది.



## ఓంకార జ్యోతిర్లింగేశ్వర

శివరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి,పిబ్రవరి 5ప్రభాతవార్త:

వెదల్ల చెరువులోని ఓంకార జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఈ నెల 15వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ ప్రాంగణంలో శివరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని, నిత్య అన్నదానం కూడా ఏర్పాటు చేస్తున్నామని కమిటీ సభ్యులు కృష్ణయ్య స్వామి, చంద్రశేఖర స్వామితెలిపారు.

## స్మార్ట్ సైన్స్ సూపర్ స్టార్స్" అనే వినూత్న కార్యక్రమం.

**తిరుపతి విద్య ఫిబ్రవరి 5 ప్రభాత వార్త** అజరామరమైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రముఖ విద్యావేత్త అయినటువంటి వాసిరెడ్డి అమర్నాథ్ గురించి తెలియని వారు ఉండరు అంటే అతిశయోక్తి లేదు.ఎంతోమంది విద్యార్థులను తమ తల్లిదండ్రుల ఆశయాలకు ప్రతిరూపంగా తీర్చిదిద్దుతున్న "స్లేట్ ది స్కూల్" విద్యా సంస్థలకు ఆయనే వ్యవస్థాపకులు. మారుతున్న కాలానికి అనుగుణంగా భవిష్యత్తును అంచనా వేస్తూ, వర్తమానం లోని విద్యార్థులను భూతకాలం లోని బట్టీ చదువులకు దూరంగా ఉంచుతూ, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసే విధంగా ఇక్కడ విద్యా విధానాన్ని తీర్చిదిద్దడం జరుగుతోంది. అందులో భాగంగా తిరుపతి సమీపంలోని వెంకట్రామాపురంలో గల స్లేట్ పాఠశాలలో శుక్రవారం "స్మార్ట్ సైన్స్ సూపర్ స్టార్స్" అనే వినూత్న కార్యక్రమం అక్కడి "స్మార్ట్ సెక్షన్స్" విద్యార్థినీ, విద్యార్థులచే నిర్వహించడం జరిగింది. జెనెటిక్ ఇంజనీరింగ్, న్యూరో సైన్స్, ఆస్ట్రోబయాలజీ, నానో టెక్నాలజీ, స్పేస్ సైన్స్, ఎకనామిక్స్ లాంటి ఫ్యూచరిస్టిక్ అంశాలకు సంబంధించిన వినూత్న ప్రాజెక్టుల ప్రదర్శనలను, పిల్లలే స్వయంగా తయారు చేసి నిర్వహించారు.ప్రదర్శనకు వచ్చిన తల్లిదండ్రులు, సందర్శకులు అక్కడి విద్యార్థుల యొక్క ప్రతిభా నైపుణ్యాలను ఎంతగానో అభినందించి,వారిని ఆశీర్వదించారు. అంతేకాకుండా విద్యార్థులను ఈ రీతిగా తీర్చిదిద్దుతున్న స్లేట్ యాజమాన్యాన్ని ప్రశంసించారు. ఉత్సాహంతో కూడిన పిల్లల ప్రదర్శనలు తల్లిదండ్రుల హృదయాలను ఆకట్టుకున్నాయి.

## 15వ తేదీ లోపు పన్ను మొత్తం చెల్లించండి

వరదయ్యపాలెం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త



ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు వరదయ్యపాలెం మండల ప్రజలకు ఈనెల 15 లోపు ఇంటి పన్ను మొత్తం కట్టవలసిందిగా డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. వరదయ్యపాలెం మండలంలోని గ్రామ పంచాయతీల ఇంటి పన్నులు ఈనెల 15వ తారీకు లోపు ప్రతి ఒక్కరు కట్టి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. డిమాండ్ నోటీసులు ప్రతిఇంటికి పంచాయతీ అభివృద్ధి అధికారులు ఇచ్చియున్నారని ఆయన తెలిపారు.

## మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఫెడరేషన్ సమావేశం



వరదయ్యపాలెం, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

మండలంలోని జెడ్పీహెచ్ఎస్ వరదయ్యపాలెం పాఠశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ ఫెడరేషన్ సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్‌జిఎఫ్ఐ తిరుపతి జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్, ఎస్‌జిఎఫ్ఐ బ్లాక్ లెవల్ కోఆర్డినేటర్ బి. కుమార్, వరదయ్యపాలెం మండల విద్యాశాఖాధికారులు ఎంఈఓ – 1, సరస్వతి, ఎంఈఓ–2 గున్నయ్య హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగిస్తూ, మ్యాజిక్ బస్ ద్వారా లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని సూచించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ఫెడరేషన్ నుండి సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యక్ష ఇంటరాక్షన్ నిర్వహించారు. ఎంఈఓ 1 సరస్వతి మాట్లాడుతూ క్రీడల ద్వారా పిల్లలకు మ్యాజిక్ బస్ అందిస్తున్న మద్దతును అభినందిస్తూ, స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధించి తల్లిదండ్రులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు. ఈ సమావేశంలో మ్యాజిక్ బస్ క్లస్టర్ మేనేజర్ శ్రీ పాలకొండ ఆనంద్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ సుమంత్, కోచులు కిరణ్, రాంబాబు, మురళి, సతీష్ కుమార్, 12 పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## బలిజ కులం రాజకీయ ఎదుగుదలకు కృషి చేయాలి

నింద్ర, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :



బలిజ కులం రాజకీయంగా ఎదుగుదలకు కృషి చేయాలని ఆర్‌పియఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డిశేఖర్ రాయల్ తెలిపారు.గురువారం మండల కేంద్రంలో శ్రీకృష్ణదేవరాయలు బలిజ ఆత్మీయ సమావేశం మండల బలిజ సంఘం కన్వీనర్ కన్నివేలురాయల్ అధ్యక్షతన జరిగింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బలిజ కులం ఒక బలమైన శక్తిగా ఎదగాలని వాటితో పాటు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలన్నారు.రాబోవు రోజుల్లో బలిజకులస్తులు ఐక్యమత్యంతో కలిసి కట్టుగా వుండి సాధించడానికి కృషి చేయాలన్నారు.ఈకార్యక్రమంలో రాయలసీమ కో ఆర్డినేటర్ త్యాగరాజ్ రాయల్,నగరి బిలిజ సంఘం అధ్యక్షులు బాబు,నాయకమురళీరాయల్,గోపిరాయల్,బాలాజీ రాయల్,క్రిష్ణయ్య,జయచంద్రన్,ఆటో బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## మోహన్‌బాబు, మంచు విష్ణు దిష్టిబొమ్మలు దగ్ధం

కేవీబీ పురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలో గురువారం కార్మిక సంస్థ, సీఐటీయూ మండల నాయకుడు నాగరాజు ఆధ్వర్యంలో మోహన్‌బాబు, విష్ణుల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థులను కిడ్నాప్ చేసి బాధ్యులైన మోహన్‌బాబు, మంచు విష్ణు, సతీష్‌లను అరెస్టు చేసి శిక్ష విధించాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయం అడిగిన విద్యార్థుల పట్ల ఇలా ప్రవర్తించడం మంచిది కాదని ఒక విద్యాలయాల సంస్థ అధినేతగా ఉండి ఇలాంటి నీచమైన పనులకు దిగజారడం మంచిది కాదని ప్రభుత్వం చట్టపరమైనట్లు తీసుకుని వారిని శిక్షించాలని లేదంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ వద్ద పిచ్చాటూరు–శ్రీకాళహస్తి రోడ్డులో మోహన్, మంచు విష్ణుల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. దీంతో అర్థగంట ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

## మాస్టర్స్ ఫౌండేషన్ ద్వారా ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ వితరణ

సత్యవేడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:



సత్యవేడు మండలంలో శ్రీనివాసరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో మాస్టర్స్ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. గురువారం ఆ ట్రస్టు సభ్యులు శ్యాంసుందర్(చైనా), కుమార్(టీచరు), జిష్ణుకుమార్(ముంబై), ప్రశాంతి(బెంగళూరు), మునికుమార్, నిషితారెడ్డి(చైనా) సహకారంతో మొదటి సారిగా రాజేంద్ర అనే దివ్యాంగుడికి ఎలక్ట్రికల్ ట్రై సైకిల్‌ని వితరణగా అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపడుతామని శ్రీనివాసులురెడ్డి, అనితలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయి సత్సంగ కమిటీసభ్యులు భాస్కర్, సుమన్ శాస్త్రి, శాంతి, మునికుమార్, చారుమతి, లలిత, ప్రసన్న కుమార్, పళణి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## అంజంజి వినాయక ఆలయం వద్ద సంకటహరచతుర్థి హోమాలు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన అంజంజి వినాయక ఆలయం వద్ద గురువారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్ఎంకె శ్రీనివాస్ గురుకుల్ హోమాలను నిర్వహిస్తుండగా ఆలయ పారోహితులు అర్ధగిరి స్వామి వేదమంత్రాలను పఠించారు.ఏర్పాట్లును అలయ సూపరి టెండెంట్ నాగభూషనం యాదవ్, ఇన్సె పెక్టర్ వెంకటస్వామిలు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## వి.బి.జి.రామ్.జి పథకం వద్దే.. వద్దు : సి.పి.ఎం

తొట్టంబేడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



ఉపాధి హామీ కూలీల పని హక్కుకు భద్రతలేని వి.బి.జి. రామ్.జి పథకాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని తొట్టంబేడు మండలం సిపిఎం పార్టీ నాయకులు పెనగడం గురవయ్య పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకమే ముద్దు, వి.బి.జి. రామ్.జి పథకం వద్దే వద్దంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని ఉద్దేశంతో మొదటగా ఈ పథకం పేరు మార్చడంతో పాటు కేంద్రం నుంచి ఉపాధి హామీ పథకానికి ఖర్చు చేసే నిధులను 40 శాతం మేరకు ఆయా రాష్ట్రాల మీద భారం మోపే విధంగా చట్టం తీసుకువచ్చారని తెలిపారు. ఈ చట్టం ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు పొట్టను చేత పట్టుకొని వలసల బాటలు పట్టక తప్పదని అన్నారు. అనంతరం ఎంపిడివో సురేందర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ బాధ్యతలు గంధం మణి, సి.ఐ.టి.యు నాయకులు వేణు, రాపూరు సుబ్రమణ్యం, వెంకటేష్, గురునాథం, ఈశ్వరయ్య, రాజ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపేడులో రక్షిత మంచినీరు ప్లాంట్ ప్రారంభం

శ్రీకాళహస్తి రూరల్ ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



శ్రీ కాళహస్తి మండలం లోని ఎంపేడు పీహెచ్సీ గ్రామంలో హాస్పిటల్ సి ఎస్ ఆర్ ఫండ్ కింద ఇండోస్ కాఫీ వర్క్స్ కంపెని వారిచే రక్షిత మంచినీటి ప్లాంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పి హచ్ సి హాస్పిటల్ ను మరింత అభివృద్ధి చేస్తాను అని తెలియజేశారు. అలాగే హాస్పటల్ కు కావలసిన పరికరాలు అందించడం జరుగుతుందని తెలిపారు. శ్రీ కాళహస్తి జడ్పిటిసి వెంకట సుబ్బారెడ్డి హాస్పిటల్ కు రెండు లక్షల విలువ చేసే పరికరాలు అందించడానికి ముందుకు వచ్చారు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ కాళహస్తి జడ్పిటిసి వెంకట సుబ్బారెడ్డి, మండల అధ్యక్షుడు అక్కింతల కృష్ణయాదవ్,తాటిపర్తి ఈశ్వర్ రెడ్డి, తాటిపర్తి రవీంద్రనాథ్ రెడ్డి,యునిట్ ఇంచార్జ రమేష్ నాయుడు,హాస్పటల్ సిబ్బంది ఇండోస్ కాఫీ వర్క్స్ ప్రతినిధులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సంకట హర చతుర్థి

తిరుపతి,పిబ్రవరి 5ప్రభాతవార్త:



వినాయక సాగర్ లోని సంకల్ప సిద్ధి వినాయక స్వామి ఆలయంలో గురువారం సంకటహర చతుర్థి పూజలు శాస్త్రోక్తకంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి శోభాయమానంగా అలంకరించి నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పురోహితుడు సురేష్ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి,, లోక ప్రభాకర్ నాయుడు, మిట్టపల్లి బ్రహ్మానందం, అన్నా రెడ్డి రాజశేఖర్ రెడ్డి ,ప్రసాద్ శాంతిప్రియ, రత్న, తన్విష్ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## బీసీ నకిలీ సర్టిఫికెట్లు పొందుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**రేణిగుంట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త** రాష్ట్రంలో దొడ్డిదారిన బిసి నకిలీ సర్టిఫికెట్లు తీసుకుంటున్న వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘర్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటాద్రి యాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో మునిసిపాలిటీ, మండల కార్యాలయాల నుండి చాలామందిఉద్యోగాలకోసం, ఎన్నికల్లో పోటీ చేయడానికి నకిలీ బీసీ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజమైన బీసీ లకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి జిల్లాలో ఎక్కువగా బీసీలు కాని వారు బీసీ సర్టిఫికెట్లు పొందుతున్నారని తక్షణం అధికారులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



## నిరుద్యోగులు... జాగ్రత్త : అర్బన్ సీఐ

రేణిగుంట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్న వారిపై చర్యలు కచ్చితంగా ఉంటాయని రేణిగుంట అర్బన్ సీఐ జయచంద్ర హెచ్చరించారు. సిఐ గురువారం ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు నిరుద్యోగుల ఆశలను అవకాశంగా తీసుకొని డబ్బులు వసూలు చేసే ప్రక్రియకు పాల్పడుతున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. విమానాశ్రయంలో ఉద్యోగాలు ఉన్నాయని, నెలకు 32 వేల రూపాయలు జీతం వస్తుందని నిరుద్యోగ యువకులు నుండి రెస్యూమ్, ఆధార్ కార్డు, ధ్రువీకరణ పత్రాలు స్వీకరిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. రెస్యూమ్‌లో ఉన్న ఫోన్ నెంబర్తో నిరుద్యోగులకు ఫోన్ చేసి మీకు ఉద్యోగం వచ్చింది 3 వేలు రూపాయలు ఫోన్ పే చేయాలని డిమాండ్ చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. నిరుద్యోగ యువకులు సైబర్ నిరంకాళ్ళ మాటలకు ప్రభావితం కాకుండా ఫోన్ పే చేయవద్దన్నారు. ఫోన్ పే చేయమన్న వారి ఫోన్ నెంబర్లు పొందుపరచి ఫిర్యాదు చేస్తే సైబర్ నేరాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పి రవి మనోహరాచారి, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## టిటిడి ఇఓకు ఘన స్వాగతం...



రేణిగుంట ఫిబ్రవరి 5 ప్రభాతవార్త

తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమితులై తొలిసారి ఉద్యోగ బాధ్యతలు చేపట్టడానికి రేణిగుంట చేరుకున్న రవిచంద్రకు గురువారం రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. తిరుపతి వెళుతూ రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆయనకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు, తహసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు స్వాగతం పలికారు. అనంతరమైన రోడ్డు మార్గంలో తిరుపతి బయలుదేరి వెళ్లారు.

## మోహన్‌బాబు, మంచు విష్ణు ఫోటోలు దగ్ధం

రేణిగుంట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త



మోహన్ బాబు యూనివర్సిటీ యాజమాన్యమైన మోహన్ బాబు, మంచు విష్ణుల ఫోటోలను రేణిగుంట పట్టణంలో గురువారం సిపిఎం పార్టీ నేతలు దగ్ధం చేసి రాస్తారోకో నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నేతలు అక్బర్, వినోద్‌లను కిడ్నాప్ చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు సిపిఎం నేతలు ఆరోపిస్తూ వారిపై క్రిమినల్ కేసులతోపాటు పీడీ యాక్టు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నుండి వసూలు చేసిన 26 కోట్ల రూపాయలు ప్రభుత్వం రికవరీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ ప్రాంతీయ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్, రేణిగుంట కార్యదర్శి ఈశ్వరమ్మ, రూరల్ కార్యదర్శి సెల్వ రాజు, రాజశేఖర్, దిలీప్ భాషా, సుబ్రహ్మణ్యం, దస్తగిరి, మునిస్వామి, మహాలక్ష్మమ్మ, పద్మమ్మ, అమ్ములు తదితరులు పాల్గొన్నారు.

## వడ్రంగి కార్మికులకు భూమిని కేటాయించాలి

తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త :



జిల్లా పరిధిలోని వడ్రంగి కార్మికులకు భూమిని కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షులు ఆకుల సుబ్రహ్మణ్యం సతీష్ రాయల్ విజ్ఞప్తి చేశారు. దీనిలో భాగంగా గురువారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆకుల సుబ్రహ్మణ్యం సతీష్ రాయల్, సంయుక్త కార్యదర్శి వెంకటాద్రి యాదవ్‌లతో పాటు తిరుపతి జిల్లా నిర్మాణ కార్మిక సంఘానికి చెందిన సుమారు 400 మంది వడ్రంగి కార్మికులతో కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ రాయల్ మాట్లాడుతూ వడ్రంగి కార్మికుల కోసం ప్రత్యేక వర్క్ షెడ్లు ఏర్పాటు చేయుటకు 10 ఎకరాల భూమి కేటాయించాలని కోరారు. వడ్రంగి కార్మికులకు సరైన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వడ్రంగి కార్మికులకు వర్క్ షెడ్లు ఏర్పాటు చేయడం ద్వారా పని వాతావరణం మెరుగుపడటంతో పాటు కార్మికుల జీవనోపాధి బలోపేతం అవుతుందని వివరించారు. ఈ విషయంపై స్పందించినకలెక్టర్ ఆ అంశాన్ని ప్రాధాన్యతగా పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## సత్యసాయినగర్‌లో చోరీ

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:



తిరుపతిరూరల్ మండలం శ్రీనివాసపురం పరిధిలోని సత్యసాయినగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగినట్లు తిరుపతిరూరల్ పోలీస్‌స్టేషన్ సి.ఐ చిన్న గోవింద్ తెలిపారు. పయ్యావుల గీత(29) ఇంటికి తాళంవేసియున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగులగొట్టి, ఇంటిలోపల కెళ్లి రూ.30.000 నగదు, సుమారు 16గ్రాముల బంగారు ఆభరణాలు, పావు కిలో వెండి ఆభరణాలు అపహరించినట్లు తెలిపారు. ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మహిళ ఎస్సై జ్యోతి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటన స్థలంలో క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించగా పరిసర ప్రాంతాల సిసిటివి పుటేజ్ పరిశీలిస్తున్నామని తెలిపారు.

## ఉద్యోగుల బకాయిలపై బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వాలి

–ఎమ్మెల్యేకి ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వినతి

**తిరుపతిరూరల్, ఫిబ్రవరి05 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇప్పటికే మంజూరై పెండింగ్‌లో ఉన్న బకాయిలు దాదాపు రూ.35వేల కోట్లకు చేరగా, వేతన సవరణ, నాలుగు విడతల డి.ఏ.లు, సరెండర్ లీవ్‌లు తదితర ఆర్థిక ప్రయోజనాలు కలిపితే మరికొన్ని వేల కోట్ల భారం నెలకున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పష్టమైన విధాన ప్రకటన చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఫిబ్రవరి 14న ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో బకాయిల చెల్లింపులకు గానీ లేదా ప్రత్యామ్నాయ పరిష్కార మార్గాలపై గానీ స్పష్టమైన కేటాయింపులు, విధాన ప్రకటన చేయాలని సంఘం కోరింది. అలాగే సిట్టింగ్ లేదా విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో వేతన సవరణ కమిషన్ ఏర్పాటు, మధ్యంతర భృతి, నాలుగు విడతల డి.ఏ.లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా సిపిఎస్ రద్దు చేసి ఏపిఎస్ పునరుద్దరణపై అధికార పార్టీల ఎన్నికల హామీ మేరకు ఈ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గం నిర్ణయం మేరకు ఫిబ్రవరి4న తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులను ఏపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, జిల్లా ప్రతినిధులతో కలిసి ఈ అంశాలన్నింటిని వివరించారు. ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి శాసన, శాసనమండలిలో ప్రస్తావిస్తామని ఎమ్మెల్యే శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీపతి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా ప్రతినిధులు మధుబాబు, మాధవరావు, పురుషోత్తంరెడ్డి, కిరణ్‌కుమార్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## సర్వేంద్రియాణాం నయనం ప్రధానం

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



పాకాల, ఫిబ్రవరి 5, ప్రభాతవార్త

పాకాల మండలం, మొగరాల ఉన్నత పాఠశాలలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ కంటి ఆసుపత్రి, కృష్ణాపురం ప్రగతి గ్రామీణ అభివృద్ధి ట్రస్ట్ సంయుక్తంగా ట్రస్టు అధ్యక్షులు డాక్టర్ నాగరాజ నాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత తెలిపారు. ఈ క్యాంపులో ఉన్నత పాఠశాలలు మొగరాల, దామలచెరువు, ప్రాథమిక పాఠశాలలు దామలచెరువు మొగరాల, రవనయ్యగారి పల్లి, వాటి అనుబంధ అంగన్వాడీ కేంద్రాల నుండి మొత్తం 621 మంది విద్యార్థులకు వైద్యాధికారి వంశీకృష్ణ, వారి బృందం పర్యవేక్షణలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం వున్న 90 మంది విద్యార్థులను గుర్తించి, అవసరమైన విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తారని ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మునస్వామి నాయుడు, శివముని, పీఆర్ఓ (ఫీల్డ్ అసిస్టెంట్) శంకర్, ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్ధులు, బాబు, ఆదికేశవులు, రామమూర్తి, వైద్య బృందం పాల్గొన్నారు.

# లక్ష టిడ్కో గృహాలు త్వరలో అందజేత



నాయుడుపేట ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: ఉగాది లోపు లక్ష టిడ్కో గృహాలను లబ్దిదారులకే అందించే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరిగిందని టిడ్కో గృహాల ఎండీ సునీల్ కుమార్‌రెడ్డి తెలియజేశారు. గురువారం నాయుడుపేట మండల పరిధిలోని బిరదవాడ వద్ద ఏర్పాటు చేసి ఉన్న టిడ్కో గృహాల నిర్మాణ పనులను ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు. టిడ్కో గృహాల నిర్మాణ పనులు, తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎండీ సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉగాది లోపు అన్ని విధాల అభివృద్ధి చేసి అన్ని మౌళిక వసతులతో లక్ష టిడ్కో గృహాలను లబ్దిదారులకు అందించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలోనే నాయుడుపేటలోని టిడ్కో గృహాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మహేష్, సీఈ మరియన్, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, మెప్మా సీఎంఎం సురేంద్ర, డీసీఓ ముషీర్ అహ్మద్, సీఎల్‌టీసీ మునీర్ తదితరులు ఉన్నారు.

## బాధ్యతతో పనిచేయండి : ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ప్రభుత్వా సుపత్రుల్లోని డాక్టర్లు తమ కర్తవ్య నిర్వహణలో బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూచించారు. గురువారం ప్రభుత్వా సుపత్రిలో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి హాజరైన ఆమెకు సిబ్బంది లేకుండా ఖాళీ కుర్చీలు కనిపించడంతో ఆసుపత్రి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొక్కుబడిగా పనిచేయ కుండా ప్రభుత్వం అందజేస్తున్న నిధులను, సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు డాక్టర్లు మానవతా దృక్పథంతో పనిచేయాలన్నారు. తాను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి వచ్చింది మాటలు చెప్పి వెళ్లిపోయేందుకు కాదని, సాధ్యమైనంత వరకు ఆసుపత్రి అభివృద్ధితో పాటు సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ రమేష్, ఏఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్, ఎంపిడిఓ మురళీ, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు ప్రణాళిక : డిఎస్పీ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: పట్టణానికి సమీపంలోని జాతీయ రహదారిపై గల హోలీక్రాస్ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటాన్ని దృష్టిలో ఉంచుకుని, వాటిని అరికట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని నాయుడుపేట డిఎస్పీ చెంచుబాబు తెలిపారు. గురువారం ఆయన సిఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు జాతీయ రహదారి సిబ్బందితో కలిసి హోలీక్రాస్ జంక్షన్‌ను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన హోలీక్రాస్ జంక్షన్ వద్ద చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## విజయవాడకు తరలిన సాగునీటి సంఘ అధ్యక్షులు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లోని సాగునీటి సంఘ అధ్యక్షులు గురువారం విజయవాడకు తరలి వెళ్లారు. రాష్ట్రస్థాయిలో విజయవాడలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే సాగునీటి సంఘ అధ్యక్షుల కార్యక్రమానికి వీరు వెళ్లారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పచ్చజెండా ఊపి తీరు ప్రయాణించే బస్సుకు పచ్చజెండా ఊపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ ఆకుతోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో బద్దెపూడి 6వ వర్ధంతి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ బద్దెపూడి వేణుగోపాల్‌రెడ్డి 6వ వర్ధంతిని ఆయన అభిమానులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా షార్ బస్టాండు వద్ద రక్తదాన శిబిరాన్ని నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జై గణేష్ ఉత్సవ కమిటీ, బైరి లీగల్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మస్తానమ్మ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి, సెంథిల్‌కుమార్, సోమశేఖర్‌రెడ్డి, బైరి పార్ధసారధిరెడ్డి, మహేష్, శివకుమార్‌రెడ్డి, శివాలు పాల్గొన్నారు.

## ఘనంగా దబ్బల జన్మదిన వేడుకలు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం ఆయన అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. గజమాలలతో సత్కరించి బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో కళత్తూరు శేఖర్‌రెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, గోగుల తిరుపాల్, శరత్ గౌడ్, తుపాకుల ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కె.చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతో రుగ్మతలకు స్వస్తి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: ధ్యానంతో శరీర, మానసిక రుగ్మతలకు స్వస్తి పలకవచ్చని ప్రముఖ స్పిరిచువల్ సైంటిస్ట్ నాగేశ్వరరావు అన్నారు. గురువారం శ్రీనగర్ కాలనీలోని యశోద రెసిడెన్సిలో నిర్వహించిన ఉచిత ధ్యాన ఆత్మ జ్ఞాన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. శ్వాస మీద ధ్యాస నిలపడమే ధ్యానమని చెప్పారు. ధ్యానం గురించి అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. సూళ్లూరుపేట పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ మాస్టర్స్, శ్రీనగర్ కాలనీ వాసులు ఆయనను ఘనంగా సన్మానించారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## అభివృద్ధికి సహకరించండి

### - జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే వినతి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సహకారం అందించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు సంబంధించి త్వరితగతిన చర్యలు చేపట్టి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజయశ్రీతో పాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఉన్నారు.

## రఫీను సన్మానించిన పట్టణ టిడిపి నేతలు



నాయుడుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: పట్టణ తెలుగు దేశం పార్టీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన షేక్ రఫీని నాయుడుపేట పట్టణానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ నివాసంలో ఆయనను తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జువ్వల పాలెం సర్పంచి తొప్పాని వెంకట రమణయ్య, మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా ఆయనను సన్మానించారు. అలాగే శ్రీపోలేరమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ నానబాల సుబ్బారావు, ఆలయ కమిటీ సభ్యులు వినుకొండ ధనంజయ, నిత్య కృష్ణారెడ్డి, పలువురు పట్టణ టిడిపి అధ్యక్షులు రఫీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కొత్తూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



వాకాడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: మండల పరిధిలోని దుగరాజపట్నం పంచాయతీలో కొత్తూరు గ్రామంలో కొత్తూరు గ్రామంలో గురువారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన ఎంవి రావు ఫౌండేషన్ 18వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో చెవి పరీక్షలు, షుగర్, బీపీ, పరీక్షలు, జనరల్ మెడిసిన్ గ్రామస్తులకు నిర్వహించారు. రీచా సంస్థ పారామెడికల్ అధికారి కె.లత పర్యవేక్షణలో చెవి పరీక్షలను చేసి, నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం కోసం తరలించారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పువరపు. లీలా మోహన్ కృష్ణ, కార్యదర్శి ఎం విజయలక్ష్మి, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వన్య ప్రాణి విభాగం అంతరించిపోకుండా ప్రత్యేక చర్యలు

వాకాడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: వన్య ప్రాణి భూభాగంకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర అడిషనల్ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శాంతి ప్రియ పాండే తెలిపారు. గురువారం వాకాడు మండలం కొండూరు పాలెం సముద్ర తీరం వద్ద మడ అడవులతో పాటు ఆలీ రిడ్లి సంరక్షణ కేంద్రంను, సముద్రపు ముఖద్వారాలు రాష్ట్ర అడిషనల్ ప్రిన్సిపల్ కన్జర్వేసన్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శాంతి ప్రియ పాండే పరిశీలించారు. ఆమె సూచనల మేరకు మడ అడవుల పెంపకంపై పలు సూచనలు సలహాలు అందజేశారు, ఆలివ్ రిడ్లీ సంరక్షణ కేంద్రం ద్వారా పెంపకం ఎదుగుదల ను మరింత పెంపొందించుకోవాలని ప్రత్యేక సలహాలు అందజేశారు. తాటి చెట్ల పెంపకమును వివరాలు అడిగి తెలుసుకున్నారు. పులికాట్ సరస్సు లేక్‌లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని సంబంధించిన అధికారులకు ఆమె సూచించారు. ఆమె వెంట తిరుపతి కన్జర్వేటర్ సెల్వం, డీఎఫ్ఓ హారిక, ఫారెస్ట్ రేంజర్ డివి రమణయ్య, ఫారెస్ట్ అధికారులు, సిబ్బందిఉన్నారు.

## పార్టీ నేతలను సన్మానించిన పట్టణ టిడిపి అధ్యక్షుడు



నాయుడుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: పట్టణంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులను పట్టణ టిడిపి అధ్యక్షుడు, నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీని ఘనంగా సన్మానించారు. నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్ రఫీ గురువారం నాయుడుపేట మాజీ ఏఎంసి ఛైర్మన్ శిరసనంబేటీ విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ మైలారి శోభారాణి, మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మలను వారి నివాసాలకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పట్టణ అధ్యక్షులు రఫీ మాట్లాడారు తెలుగుదేశం పార్టీకి సంబంధించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజల కొరకు ప్రజలతో కలిసి వారికి తగినంతగా పార్టీ కోసం నియోజకవర్గంలో సేవలు చెయ్యాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నానబాల సుబ్బారావు, అవధానం సుధీర్ వినుకొండ ధనంజయ, నిత్యా కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు, యచ్చా శ్రీనివాసులు, అరిగొండ జయరామ్, హైమావతి, రేవతి, పలువురు నాయకులు ఉన్నారు.

# పార్టీకి అండగా ఉన్న వారికి అందలం

## -జిల్లా గ్రంథాలయ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం



శ్రీకాళహస్తి ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీకి ఆది నుంచి అ ండగా ఉంటూ పార్టీ విజయానికి పాటు పడిన వారి సేవలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నటికీ మరువరని వారికి సముచిత స్థానం కల్పిస్తారని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు మండలంలోని మారుమూల గ్రామానికి చెందిన రెడ్డివారి గురువారెడ్డి పార్టీ విధేయుడుగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారని ఆయన జవాబుదారి తనన్నా గుర్తించిన ముఖ్యమంత్రి ఉమ్మడి జిల్లా స్థాయి పదవి అవకాశం కల్పించారని ఆయన అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా గురువారెడ్డి ప్రమాణ స్వీకారం చేసారు. ఈ సభకు పార్టీ శ్రేణులు కదలి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో తిరుపతి పార్లమెంట్ పారీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మీ మాట్లాడుతూ గురువారెడ్డి నిబద్ధతతో పార్టీ కి అంకితభావంతో పనిచేసే నాయకుడు ఉమ్మడి జిల్లాలో బీసీల్లో పట్టున్న నాయకుడు ప్రస్తుతం ఉన్న కూటమి పాలనలో ఒత్తిడి ఉన్న గురువారెడ్డిని ఛైర్మన్ స్థాయిలో పెట్టాలని ఆలోచనతో ఈ పదవిని ముఖ్యమంత్రి అప్పగించారు అన్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మా నియోజకవర్గంలో నిజాయితీగా మా తండ్రి హయాం నుంచి పార్టీకి అంకితభావంతో పనిచేస్తూ ఎన్ని ఒత్తిడిలు వచ్చినా పార్టీని అంటిపెట్టుకొని కష్టపడి పనిచేసిన వ్యక్తి బీసీ వర్గాలు ఏకం చేసి నియోజకవర్గంలో నా గెలుపు కోసం కృషి చేసిన నాయకుడు గురువారెడ్డి. గత 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు అరెస్టు సందర్భంగా నిరసనలు జరిపితే ఆతనిపై అప్పటి ప్రభుత్వం 307 కేసు పెట్టి జైలుకు పంపిన లెక్కచేయకుండా 23 కేసులు ఉన్నా మొక్కవోని విశ్వాసంతో పార్టీ కోసం పనిచేశారు. తిరుపతి నియోజకవర్గ ఇన్చార్జ్ సుగుణమ్మ మాట్లాడుతూ గురువారెడ్డి నాకు తెలిసినప్పటినుండి కూడా పార్టీకి నిజాయితీతో కష్టపడుతూ పార్టీ కష్టకాలంలో అన్ని విధాల కార్యక్రమాలు నిర్వహిస్తూ అధినేత కుదగ్గరగా ఉంటూ ఈరోజు గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడానికి స్వాగతిస్తున్నాం. గురువారెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహా యాదవ్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ యాదవ్ నాయకులుతో కలిసి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి అనంతరం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వేలాదిమంది సమక్షంలో ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని తన ఒళ్ళో పెట్టుకుని గురువారెడ్డి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గా వేలాది మంది సమక్షంలో ప్రమాణ స్వీకారాన్ని చేయడం చేశారు. జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌వీఆర్ ఎస్ఎస్ శర్మ చేతుల మీదుగా గురువారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు పార్టీ అధ్యక్షులు షణ్ముఖ రెడ్డి రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు శ్రీపతి బాబు రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం రాష్ట్ర మాజీ మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ పోలిశెట్టి కడప డిసిఎంఎస్ ఛైర్మన్ జయప్రకాష్ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ శ్రీకాళహస్తి బిజెపి ఇన్చార్జ్ కోలా ఆనంద్ తిరుపతి కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధులు ఎన్ బి సుధాకర్‌రెడ్డి, విజయ శేఖర్‌రెడ్డి కోడూరు బాలసుబ్రమణ్యం రాష్ట్ర కార్యవర్గ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి బొమ్మి సురేంద్ర సురా సుధాకర్ రెడ్డి బుల్లెట్ రమణ దంపూర్ భాస్కర్ యాదవ్ మనం శ్రీనివాసులు చలపతి నాయుడు గంగమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ మహేష్ తిరుపతి పార్టీ నాయకులు జెబీ శ్రీనివాస్ పులిగోరు మురళీకృష్ణ రెడ్డి గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు శివ కోటిరెడ్డి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్టీ నాయకులు కోదండ యాదవ్ దేవానంద నాయుడు శ్రీకాళహస్తి పార్టీ పరిశీలకులు అంకమ్మ చౌదరి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు యశ్వంత్ రెడ్డి లోకేశ్వరి మార్కెట్ కమిటీ ఛైర్మన్ లు మునిరాజా చెంచయ్య నాయుడు పలువురు రాష్ట్ర జిల్లా నియోజకవర్గ స్థాయి నాయకులు శ్రీకాళహస్తికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులందరూ వివిధ స్థాయిలో ఉన్నటువంటి పదవుల్లో ఉన్న నాయకులందరూ పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్రజలు ఉమ్మడి జిల్లాలో ఉన్నటువంటి నాయకులు నెల్లూరు కడప జిల్లాకు చెందినవారు పెద్ద ఎత్తున హాజరై నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన గురువారెడ్డిని శాలువాలు పూలమాల బొకేలతో పెద్ద ఎత్తున సత్కరించి శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.

## మత్తుకు దూరంగా వుంటే ఉజ్వల భవిష్యత్తు

### - విద్యార్థులకు ఎస్పీ తుషార్ డూడి పిలుపు



చిత్తూరు, ఫిబ్రవరి 6 ప్రభాతవార్త: మత్తుకు దూరంగా వుండి విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎస్పీ తుషార్ డూడి పిలుపునిచ్చారు. పిసిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం మత్తు పదర్థాల నివారణ, అక్రమ రవాణాపై జరిగిన అవగాహన కార్యక్రమానికి ఎస్పీ తుషార్ డూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జరిగిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ నేటి యువత రేపటి దేశ భవిష్యత్తు అని, యువత మత్తు పదర్థాల బారిన పడితే వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబాలు, సమాజం, దేశం మొత్తం నష్టపోతుందన్నారు. మత్తు పదర్థాలు క్షణిక ఆనందం కల్గిస్తాయని, అయితే అవి జీవితాంతం వెంటాడే నష్టంను మిగులుస్తాయన్నారు. డ్రగ్స్ వద్దు డ్రీమ్స్ కావాలని అనే నినాదంను ప్రతి విద్యార్థి జీవిత సూత్రంగా ముందడుగు వేయాలన్నారు. మత్తు పదర్థాలను ప్రారంభంలో ఒకటి, రెండు సార్లు మాత్రమే అని ప్రారంభించి కొన్ని రోజుల్లోనే అది అలవాటుగా చివరికి బానిసలుగా తయారవుతారన్నారు. మత్తు పదర్థాలు మన జీవితాలను లోపలి నుండి ఖాళీ చేస్తుందన్నారు. మత్తు పదర్థాలకు సంబంధించి మొదటి అడుగు వేయకపోవడమే ఉత్తమ మార్గమన్నారు. యువతను లక్ష్యంగా చేసుకుని కొంతమంది అక్రమ రవాణాదారులు మోసపూరిత మార్గాల్లో డ్రగ్స్ వ్యాప్తి చేస్తున్నారన్నారు. తెలియని వ్యక్తులు ఎదైనా పదర్థాలు ఇస్తే వాటిని తిరస్కరించాలన్నారు. ఇటీవల కొన్ని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తే విద్యార్థుల స్కూల్ బ్యాదుల్లో పోగాకు ఉత్పత్తులు బయటపడ్డాయని ఇది తీవ్ర ఆందోళన కలిగించే విషయం అన్నారు. చిన్న వయస్సులోనే ఇలాంటి అలవాట్లు మొదలైతే భవిష్యత్తులో మరింత ప్రమాదకరమైన మత్తు పదర్థాల వైపుకు వెళ్ళే అవకాశం వుంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ డాక్టర్ తరుణ్ పహ్వా, డిఎస్పీ టి.సాయినాథ్, వన్‌టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ మోతూరి, క్రైమ్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆదాకు పిఎం సూర్యఘర్

### -రాష్ట్రంలోనే అత్యుత్తమ బ్యాంకుగా తీర్చి దిద్దాలి: ఎంఎల్ఏ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంకును రాష్ట్రంలోనే అత్యుత్తమ టౌన్‌బ్యాంకుగా తీర్చి దిద్దుటకు పాలకమండలి పని చేయాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం బ్యాంకు విద్యుత్ బిల్లు ఆదాకు పిఎం సూర్యఘర్ పథకంలో ఏర్పాటు చేసిన 7కిలో వాట్ల రూఫ్‌టాప్ సోలార్ సిస్టం, ఆధునిక లాకర్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఛైర్మన్ షేక్ ఖాదర్‌బాషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో చేపట్టిన ప్రగతిని వివరించారు. తమ ఆలోచనలను కమిటిలో చర్చించిన అంశాలను ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. కాగా ఖాతాదారులు, వ్యాపారస్తుల సౌకర్యార్థం పట్టణంలో ఎటిఎంను ఏర్పాటు చేయుటకు ప్రయత్నిస్తున్నట్లు ఎంఎల్ఏ దృష్టికి తెచ్చారు. బ్యాంకు ఆధునీకరణతో ఖాతాదారులను అకట్టుకునే రీతిలో తీర్చి దిద్దుతున్నట్లు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి మనోభావాలకు అనుగుణంగా సేవలందించుటకు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు పోతామన్నారు. ఈ సభలో ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ యువకుల పాలన అభివృద్ధికి రాచబాటగా ఉంటుందనే పార్టీ పదవులు కానీ నామినేటె పదవులు కానీ తాను యువకులకే అందజేస్తున్నామని అన్నారు. దేవాలయం, మున్సిపాలిటి నుంచి ఆర్థిక మద్దతు సాధ్యాసాధ్యాలను పరిశీలించి అందిస్తామన్నారు. అంతేకాక బ్యాంకు మనుగడకు ఆర్థిక పతిపత్తి ఎంతో అవసరం అన్నారు. కాబట్టి డిపాజిట్ దారులను ఆకర్షించేందుకు పథకాలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్‌కుమార్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు పనబాక లక్ష్మీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, బ్యాంకు సిఇఓ ధనంజయులు, పాలకమండలి సభ్యులు, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో పరారీలో ఉన్న ముద్దాయి అరెస్టు

సత్యవేడు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: సత్యవేడు మండలంలో మాధక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టే దిశగా పోలీసులు చేపట్టే కఠిన చర్యలు మరోసారి ఫలితమిచ్చాయి. సుమారు 2 కిలోల గంజాయి స్వాధీనం కేసులో పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు బి.దికరన్ దీనా(26), తండ్రి బాలసుబ్రహ్మణ్యం, బీసీ కాలనీ, సత్యవేడు పట్టణానికి చెందిన వ్యక్తిని గురువారం మధ్యాహ్నం 1 గంట సమయంలో సత్యవేడు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎస్ఐ సాయినాథ్‌చౌదరి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. గత ఏడాది డిసెంబరు 31వ తేదీ మధ్యాహ్నం సమయంలో సత్యవేడు-ఉలవచేను రహదారిలోని తెలుగు గంగ కాలువ బ్రిడ్జి వద్ద ఉలవచేను గ్రామ సమీపంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించగా, సత్యవేడు మండలం ఉలవచేను గ్రామానికి చెందిన ఎస్.మహేష్‌ని పట్టుకుని, అతడి వద్ద నుంచి 2 కిలోల గంజాయితో పాటు టీఎన్ 18 సీవై 3695 నంబరు గల టీవీఎస్ ఎన్‌టార్క్ స్కూటీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా వ్యవహరించిన దినకరన్ అప్పటి నుంచి పరారీలో ఉండడంతో ప్రత్యేక నిఘా పెట్టిన పోలీసులు, విశ్వసనీయ సమాచారం ఆధారంగా అతడిని పట్టుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇంకా పలువురు నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడిస్తూ త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.మురళి మాట్లాడుతూ మండల పరిధిలో మాధక ద్రవ్యాల అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించబోమని హెచ్చరించారు. మత్తు పదార్థాల నిర్మూలన లక్ష్యంగా కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు.

## డ్వాక్రా మహిళ ఆత్మహత్యాయత్నం!



పలమనేరు, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లె పంచాయితీ దిగువ కల్లాడుకు చెందిన డ్వాక్రా మహిళ సరోజమ్మ గురువారం మధ్యాహ్నం పెట్రోల్‌లో ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. సమయానికి అక్కడే ఉన్న పోలీసులు నివారించి ఆమెను ప్రాణాలతో కాపాడారు. సరోజమ్మ ఇదే గ్రామంలో 10 మంది ఉన్న డ్వాక్రా గ్రూపులో సభ్యురాలుగా వుంది. 11 ఏళ్ళుగా ఇతర మహిళలతో పాటు రుణాలు పొందుతూ తీసుకున్న రుణాలు చెల్లిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ నెలలో కొత్తగా రుణాలు మంజూరయ్యాయి. ఐతే సంఘమిత్రో పాటు మిగిలిన సభ్యులు ఈమెకు రుణం ఇవ్వడానికి నిరాకరించారు. నెలనెలా సక్రమంగా రుణం చెల్లించడంలేదని దీని వల్ల తాము ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. ఐతే సరోజమ్మ మాత్రం తాను రెండు నెలలు మాత్రమే కొన్ని కుటుంబ సమస్యల వల్ల ఆలస్యంగా చెల్లించానని అంతే తప్ప రుణం చెల్లించకుండా చేయలేదని ఇది కారణంగా చూపి తనకు రుణం ఇవ్వకపోవడం ఎంత వరకు సబబని ఆరోపించింది. ఈ విషయంపై అధికారులను విన్నవించినా పట్టించుకోకపోవడంతో సరోజమ్మ పలమనేరుకు వచ్చి సంఘమిత్ర కార్యాలయం ఎదుట ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పటించుకోవడానికి ప్రయత్నించింది. అక్కడే ఉండి విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఆమెను ఆత్మహత్యాయత్నం నుండి కాపాడారు. ఈ విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీఇవ్వడంతో మహిళ శాంతించింది.

## మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలి



నాయుడుపేట, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: మోహన్ బాబు యూనివర్సిటీ, విద్యానికేతన్ కళాశాలలో విద్యార్థుల ఇబ్బందులు అధిక ఫీజులు వసూళ్ల విషయమై తెలుసుకునేందుకు వెళ్లిన విద్యార్థి సంఘ నాయకులపై బౌన్సర్లతో దాడి చేయించిన మోహన బాబు విష్ణులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నాయుడుపేట సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మోహన్ బాబు యూనివర్సిటీ బౌన్సర్లతో పాటు మోహన్ బాబు, విష్ణులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు సతీష్ షేక్ అబ్దుల్, ఫయాజ్, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమావేశానికి వెళ్లిన సాగునీటి సంఘం అధ్యక్షులు



బాలాయపల్లి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: మన నీరు మన భవిష్యత్తు సాగు నీటి సంఘాల పాత్ర సమావేశ కార్యక్రమానికి అమరావతికి ప్రత్యేక బస్సులో సాగు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తరలి వెళ్లారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో 26 చెరువుల సాగు నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు అమరావతికి పెరేడ్ గ్రౌండ్ హాజరయ్యామని కయ్యూరు అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడు, కోటేశ్వర గౌడ్ తెలిపారు.

## సిబ్బంది సంక్షేమం కొరకు ఉచిత వైద్య శిబిరాలు

వెంకటగిరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: సిబ్బంది సంక్షేమం కొరకు ఉచితంగా వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్ తెలిపారు. 9వ బెటాలియన్‌లో యూనిట్ హాస్పిటల్ నందు మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపుకు ముఖ్యఅతిథిగా కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్ వ్యవహరించారు. ఈ మెడికల్ క్యాంపు తిరుపతి రమాదేవి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మరియు ఫిరోజ్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్స్‌చే నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో బెటాలియన్ చుట్టుపక్కల ఉన్న పల్లెల్లోని ప్రజలు మరియు బెటాలియన్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రమాదేవి హాస్పిటల్స్ డాక్టర్స్ టీ రాజేశ్వరి న్యూరాలజిస్ట్, డాక్టర్ బి కిషోర్ కుమార్, ఫిరోజ్ డెంటల్ హాస్పిటల్ డాక్టర్స్ కే దేవరాజు, బి మోనిక బెటాలియన్ యూనిట్ హాస్పిటల్ డాక్టర్స్ కిరణ్ ప్రసాద్ సునీత, అసిస్టెంట్ కమాండెంట్ టి రామకృష్ణ పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వండి : ఎంపీపీ



విజయపురం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త: తాగునీటి సమస్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ లక్ష్మిపతిరాజు పేర్కొన్నారు. గురువారం మండలపరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమస్యల వారీగా సమీక్షించారు. ఈ విషయమై అధికారులు దృష్టి సారించాలని సింగిల్‌విండో అధ్యక్షుడు బాబునాయుడు కోరారు. నగరి నుంచి కేవీ పురం, కాళికాపురం మీదుగా విజయపురం బస్సు నడపాలని సభ్యులు డిమాండ్ చేశారు. జంబాడలో నైట్‌హాల్ట్ బస్సును పాతార్కాడులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్ బొబ్బిలి కోరారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. కోసలనగరంలో తరచూ పంచాయతీ బోర్లను మరమ్మతులకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్ కోరారు. నారపరాజు కండ్రిగ నుంచి చిత్తూరుకి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ రాజమ్మ, ఎంపీడీవో రాజేంద్ర, తహసీల్దార్ కిరణ్, ఏవో రజనికుమారి, సీడీపీవో ఇందిరప్రియదర్శిని, ఏఈలు వీరభద్రం, సదాశివం, గిరీష్‌కుమార్, ఏళుమలై, సింగిల్‌విండో అధ్యక్షుడు బాబుయాదవ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.